

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL  ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి  శనివారం 09-07-2022  సంపుటి : 03  సంచిక : 285  పేజీలు : 4  వెల : రూ 3-00

# జపాన్ మాజీ ప్రధాని షింజో అబే హత్య



టోక్యో: జపాన్ మాజీ ప్రధాని షింజో అబే హత్యకు గురయ్యారు. ఆయనపై ఇవాళ హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. నారా సిటీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఓ వ్యక్తి వెనుక నుంచి వచ్చి తుపాకీతో కాల్చాడు. షింజో అబే ఛాతి, మెడలోకి బుల్లెట్లు దిగినట్లు తెలిసింది. అబేను హుటాహుటిన ఆస్పిటల్‌కు తరలించి వైద్యం అందించారు. కానీ 67 ఏళ్ల షింజో అబే హాస్పిటల్‌లో ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. కాల్పులు జరిపిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5.03 నిమిషాలకు షింజో మృతిచెందినట్లు హాస్పిటల్ వర్గాలు పేర్కొన్నాయి.షింజో అబే తన ప్రధాని పదవికి 2020లో రాజీనామా చేశారు. ఆరోగ్య కారణాల రీత్యా ఆయన పదవికి రాజీనామా చేశారు. కానీ ఆయన మాత్రం రాజకీయంగా యాక్టివ్‌గా ఉన్నారు. ఆయన రెగ్యులర్‌గా మీడియాలో కనిపించేవారు. కరెంట్ అఫైర్స్ గురించి చర్చించేందుకు ఆయన తరుచూ మీడియాలో కనిపించేవారు. నాటో సభ్యుల తరహాలోనే అణ్వాయుధాల షేరింగ్ అంశాన్ని జపాన్ చర్చించాలని ఫిబ్రవరిలో ఓ డిబేట్‌లో తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా అటాక్ చేసిన నేపథ్యంలో ఆయన ఆ అభిప్రాయాన్ని వినిపించారు. శుక్రవారం నారా పట్టణంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సయమంలో ఓ ఆగంతకుడు షింజోపై కాల్పులు జరిపాడు. ఎగువ సభకు ఎన్నికల నేపథ్యంలో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ తరపున షింజో ప్రచారం నిర్వహించారు. నారా తర్వాత క్యోటో, సైతామాలో ఆయన ప్రచారం చేయాల్సి ఉంది. జపాన్ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా చేసిన వ్యక్తిగా అబేకు గుర్తింపు ఉన్నది. 2006 నుంచి 2007, ఆ తర్వాత 2012 నుంచి 2020 వరకు ఆయన ఆ దేశ ప్రధానిగా చేశారు.షింజో అబేది పేరుగల కుటుంబం. ఆయన తండ్రి షింతారో అబే ఆ దేశ విదేశాంగ మంత్రిగా చేశారు. ఇక అబే తాత ఆ దేశ ప్రధానిగా చేశారు.మాజీ ప్రధాని నొబుషుకే కిషి మనువడే షింజో అబే. రాజకీయంగా షింజో ఫ్యామిలీకి ఘన చరిత్ర ఉంది. అయినా జపాన్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా షింజో కొనసాగారు. ప్రధానిగా ఉన్న సమయంలో షింజే తన ఆర్థిక విధానాలతో ఆకట్టుకున్నారు. విదేశాంగ, ఆర్థిక విధానాల వల్ల ఆయనకు ఎబినామిక్స్ అన్న పేరు వచ్చింది.షింజో అబే సెప్టెంబర్ 21, 1954లో జన్మించారు. షింజో తాతయ్య, పెద్దనాన్నలు ఆ దేశ ప్రధానులుగా చేశారు. ఆయన తండ్రి విదేశాంగ మంత్రిగా చేశారు. టోక్యోలోని సీకీ యూనివర్సిటీలో పోలిటిక్స్ చదివారు. యునివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియాలోనూ ఉన్నత విద్యను అభ్యసించారు. తొలుత ఆయన బిజినెస్‌లోకి ఎంటర్ అయ్యారు. 1979లో కోబే స్టీల్‌లో పనిచేశారు. మూడేళ్ల తర్వాత.. విదేశాంగ శాఖలో అసిస్టెంట్‌గా చేరారు. 1993లో తొలిసారి జపాన్ ప్రతినిధుల సభకు ఆయన ఎన్నికయ్యారు. అప్పుడు షింజో వయసు 38 ఏళ్లు. ఎన్నో క్యాబినెట్ హోదాల్లో పని చేశారు. ఎల్డీపీ పార్టీకి 2003లో సెక్రటరీ జనరల్ అయ్యారు. ఆ తర్వాత నాలుగేళ్లకు పార్టీ ప్రెసిడెంట్ అయ్యారు. ఆ తర్వాత జపాన్ ప్రధాని అన్నారు. తొలి టర్మ్‌లో కొన్ని వివాదాలు చుట్టుముట్టాయి. ఆరోగ్యం క్షీణించడంతో .. పార్టీకి, ప్రధాని పదవికి రాజీనామా చేశారు. 2012 నుంచి 2020 వరకు ఆయనే ప్రధానిగా చేశారు. 67 ఏళ్ల వయసులో తూపాకీ కాల్పుల్లో షింజో అబే మరణించారు.

# కళ్యాణదుర్గంలో ఉద్రిక్తత

అనంతపురం కళ్యాణదుర్గం నియోజకవ ర్గంలో ఉద్రిక్తత నెలకొంది.ఇక్కడ కళ్యాణదుర్గం మున్సి పాలిటీ పరిధిలో ఉన్న చెరువును మంత్రి ఉషశ్రీ అను చరుల సహాయంతో పూడ్చివేస్తున్నారని గత 40 రోజుల నుంచి తెదేపా ఆధ్వర్యంలో రైతుల సహకారంతో ఆందోళన చేస్తున్నారు. అధికారులు సహకరించక పోవడంతో నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ మాదినేని ఉమామహే శ్వర నాయుడు హైకోర్టులో చెరువు పూడ్చివేతకు వ్యతిరేకంగా పిల్ దాఖలు చేశారు. ఇందులో రెండు వారాల్లోగా అధికారులు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు పేర్కొన్నట్లు ఉమామహేశ్వర్ నాయుడు తెలి పారు. అయితే ఉమామహేశ్వర్ నాయుడు మంత్రిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఇంచార్జ్ ఉమామ హేశ్వర నాయుడు తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మలను ఉదయం వైసిపి నేతలు దగ్ధం చేశారు. అప్పుడు ఒక్క పోలీసు కూడా కనిపిం చకపోగా ఎన్టీఆర్ భవన్ నుంచి తెదేపా నేతలు ర్యాలీగా బయలుదేరి ముఖ్యమంత్రి జగన్, మంత్రి ఉష దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు అత్యు త్సాహం ప్రదర్శించారు. పట్టణ తెదేపా కన్వీనర్ మురళి జిల్లా కార్యదర్శి తలారి సత్యప్ప, కుందిర్పి మండల పార్టీ కన్వీనర్ ధనుంజయ తో పాటు మరికొంతమందిని అదుపులోకి తీసుకున్నా రు. దీంతో తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ ఉమామహే శ్వర నాయుడు తో పాటు వందలాదిమంది తెదేపాశ్రేణు లు కళ్యాణదుర్గం పట్టణ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి తమపై తప్పుడు కేసులు పోలీసులు బనాయిస్తున్నారని ఉదయం తమ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన వారిపై ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని బైఠాయించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు తెదేపా నేతలకు తీవ్ర వాగ్వాదం జరిగింది. వైసిపి నేతలపై లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తే చర్యలు తీసు కుంటామని పోలీసు అధికారులు తెలపడంతో హైడ్రా మాకు తెరపడింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వర నాయుడు మాట్లాడుతూ పోలీసులు ఏకపక్షం గా ప్రవర్తిస్తూ తెదేపా నేతలనుఇబ్బందులకుగురి చేస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిలబ డాల్సిన పోలీసు అధికారులు ఏకపక్షంగా వ్యవహరి స్తుండడం దారుణమని కళ్యాణదుర్గం ప్రాంత ప్రజలకు ఇబ్బంది కలగకుండా చెరువు పూడ్చివేతను అడ్డుకోవ డం అధికార పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతు న్నారని ఉమామహేశ్వర నాయుడు ఆరోపించారు



# కోట్లాది మంది అభిమానులకు, ప్రజలకు సెల్యూట్ చేస్తున్నా



తాడేపల్లి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని శుక్ర, శనివారాల్లో వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న ప్లీనరీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ మేరకు సీఎం జగన్ మాట్లాడుతూ.. 2009, సెప్టెంబర్ 25న పావురాలగుట్టలో సంఘర్షణ మొదలైంది. ఓదార్పు యాత్రతో పార్టీ ఒక రూపం దాల్చింది. వైఎస్సార్ ఆశయాల సాధన కోసం పార్టీ ఆవిర్భవించింది.నన్ను ప్రేమించి, నాతో వెన్నుదన్నుగా నిలబడ్డ కోట్లాది మంది అభిమానులకు, ప్రజలకు సెల్యూట్ చేస్తున్నా. ఈ 13ఏళ్ల ప్రయాణంలో ఎన్నో సవాళు ఎదుర్కొన్నాం. నాన్న నాకు ఇచ్చిన ఈ జగమంత కుటుంబం నా చేయి ఎప్పుడూ వదల్లేదు. ప్రజలు మూడేళ్ల కిందట కనీవినీ ఎరుగని మెజారిటీ ఇచ్చారు. ఏకంగా 151 స్థానాల్లో విజయం సాధించిన మనకు ప్రజలు అధికారం కట్టబెట్టారు. ప్రతిపక్షాన్ని 23 ఎమ్మెల్యే సీట్లకు, 3 ఎంపీ సీట్లకు దేవుడు పరిమితం చేశాడు. పదవి అంటే అధికారం కాదు.. ప్రజల మీద మమకారం అని నిరూపించాం. ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ప్రతిక్షణం తపనపడ్డాం. అన్ని వర్గాల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. మేనిఫెస్టోలో హామీలు ఇచ్చి మాయం చేసే పార్టీలను చూశాం. ప్రజలు నిలదీస్తారేమోనని టీడీపీ మేనిఫెస్టోని మాయం చేసింది. ఆ పరిస్థితి నుంచి మేనిఫెస్టో అంటే అమలు చేసే ప్రతిజ్ఞగా చూపించాం. మన మేనిఫెస్టోను ప్రజల ముందు పెట్టి 95 శాతం హామీలు అమలు చేశాం. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను చూడటానికే టీడీపీ భయపడే పరిస్థితి వచ్చింది.గుండె చెదరలేదు.. సంకల్పం మారలేదుఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ వైఎస్సార్‌సీపీ అని గర్వంగా చెప్తున్నాం. ఈ మూడేళ్ల ప్రయాణం ఎన్నో పోరాటాల ప్రస్థానం. రైతులపై మమకారం అంటే ఇలా ఉంటుందని నిరూపించింది మన పాలన. మనపై ఎన్ని రాళ్లు పడ్డా, మనపై ఎన్ని నిందలు వేసినా ఎదుర్కొన్నాం. ఎన్నికుట్రలు చేసినా, ఎన్ని దాడులు జరిగినా గుండె చెదరలేదు.. సంకల్పం మారలేదు. నాకు ఇచ్చిన ఈ కుటుంబం ఏనాడు నా చేయి వీడలేదు. మన పాలనలో దోచుకోవడం, పంచుకోవడం ఆగిపోయింది. కాబట్టి గజదొంగల ముఠాకు నిద్రపట్టడం లేదు అని సీఎం జగన్ అన్నారు.దుష్టచతుష్ట?యం మన పాలనలో మంచి ని ఓర్వలేక అబద్దాల విషప్రచారం చేస్తున్నారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు ఇవాళ నోరు పారేసుకుంటున్నారు. ఆ కట్టుకథల్ని, వాటికి అబద్ధాలు జోడించి ఎల్లోమీడియా ప్రచారం చేస్తోంది. గతంలో రాష్ట్రాన్ని దోచుకో పంచుకో అన్నట్లుగా గజదొంగల ముఠా వ్యవహరించింది. ఇప్పుడు అవకాశం లేక కడుపుమంటతో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ జనం వెంట, జనం గుండెల్లో ఉంది. గజదొంగల ముఠా మాత్రం, ఎల్లో మీడియా, ఎల్లో సోషల్ మీడియాలో మాత్రమే ఉంది. వాళ్లకు, మనకు ఎక్కడా పోలిక లేదు. మనది చేతల పాలన.. వాళ్లది అబద్ధపు విష ప్రచారం అని సీఎం జగన్ అన్నారు.

# జగన్నాథుని ఆశీస్సులతో సుభిక్షంగా ఆంధ్రప్రదేశ

### గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్
### ఇస్కాన్ జగన్నాథ యాత్రను ప్రారంభించిన గవర్నర్
### నగరంలో ఎనిమిది కిలోమీటర్ల రథయాత్ర

జగన్నాథుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. మానవ ప్రయత్నానికి అండగా దైవ సంకల్పం తోడైతే అంతా శుభమే జరుగుతుందన్నారు. ఇస్కాన్ దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ జగన్నాథ స్వామి రథయాత్రను శుక్రవారం గవర్నర్ విజయవాడ వజ్ర గ్రౌండ్స్ నుండి ప్రారంభించారు. రథ పూజతో గవర్నర్ జగన్నాథ రథయాత్రను తొలిసారి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు పరిచయం చేసారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ అధ్యాత్మికత ప్రజల మధ్య శాంతి సామరస్యాలను హేతువుగా నిలుస్తుందన్నారు. పూరి జగన్నాథ రథయాత్ర ప్రపంచ ప్రసిద్ధి నొందిన రథయాత్రగా గుర్తింపు పొందిందన్నారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద భక్తి సమూహంగా పూరి రథయాత్ర నిలించిందన్నారు. ఇస్కాన్ దేవాలయ ప్రతినిధులు మంచి కార్యక్రమాన్ని ఎంచుకున్నారని, ఈ రోజు 80పైగా దేశాలలో సుమారు 400ల వరకు రథయాత్రలను ఇస్కాన్ నేతృత్వంలో భక్తజనావళి ఆధ్వర్యంలో జరుగుతుండటం మంచి పరిణామమన్నారు. విజయవాడలో తొలిసారి రథయాత్రను చేపడుతున్నప్పటికీ జగన్నాధుని ఆశీస్సులతో ఇది భవిష్యత్తులో అతి పెద్ద రథయాత్రగా రూపుదిద్దుకుంటుందన్న ఆశాభావాన్ని గవర్నర్ వ్యక్తం చేసారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణా మండలి అధ్యక్షులు ఎకె ఫరీడా,



ఇస్కాన్ దేవాలయ అధ్యక్షుడు చక్రధారి దాస్, వేణుధారి దాస్, శ్యామసుందర అత్యుత దాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా రైతు దినోత్సవ వేడుకలు

అమరావతి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోంది.. జిల్లా, రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేలు) స్థాయిల్లో వేడుకలు నిర్వహిస్తోంది. వీటిలో పెద్ద ఎత్తున రైతులను భాగస్వాములను చేసేలా కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా గత మూడేళ్లుగా పెద్ద ఎత్తున అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.శాఖల వారీగా ఫొటో ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేస్తోంది. శాస్త్రవేత్తలు, నిపుణులు, ఆదర్శ రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. తొలుత వైఎస్సార్‌కు ఘన నివాళు లర్పించాక వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. వైఎస్సార్ రైతు భరోసా ? పీఎం కిసాన్, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, వైఎస్సార్ యంత్ర సేవా పథకం వంటి వాటి ద్వారా లబ్ధి పొందిన రైతులను



భాగస్వాములను చేస్తున్నారు.వివిధ పథకాల ద్వారా రైతన్నలకు నేరుగా రూ.1,27,633.08 కోట్ల మేర లబ్ధి చేకూర్చిన విషయాన్ని రైతులకు వివరించనున్నారు. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, రూ.2 వేల కోట్లతో విపత్తు సహాయ నిధి, వ్యవసాయ సలహా మండళ్ల ఏర్పాటు, ఉచిత విద్యుత్, అమూల్ ద్వారా పాడి రైతులకు అదనంగా లబ్ధి, ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ తదితర పథకాలు, కార్యక్రమాల ద్వారా రైతులకు ప్రభుత్వం లబ్ధి కలిగిస్తోంది. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.7 లక్షల ఆర్థిక సాయం, వైఎస్సార్ జలకళ ద్వారా సన్న, చిన్నకారు రైతులకు 2 లక్షల బోర్లు ఉచితంగా తవ్వించి, మోటార్లు కూడా ఉచితంగా ఇస్తున్నారు. వీటన్నింటిపై రైతు దినోత్సవ వేడుకల్లో అవగాహన కల్పించనున్నామని వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.


# వేధింపులు తాళలేకే పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్య : నారా లోకేశ్



అమరావతి : అమలాపురం జిల్లా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి రొడ్డా భవానీ వైసీపీ నేతల వేధింపులను భరించలేక గిరిజన ఉద్యోగిని ఆత్మహత్యకు పాల్పడిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. జగన్ అండతో వైసీపీ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారని అన్నారు. బలవన్మరణానికి కారకులైన వైసీపీ నాయకులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.సుధాకర్ నుంచి భవనీ వరకూ ప్రభుత్వ ఉద్యోగుల మరణాలన్నీ వైసీపీ చేసిన హత్యలేనని మండిపడ్డారు. ఈ హత్యలను తప్పుదారి పట్టిస్తూ, నిందితులైన వైసీపీ నేతలని కాపాడుతున్న పోలీసులు, అధికారులకు కూడా జగన్ రెడ్డి క్రూర పాలనలో ఇదే గతి పట్టొచ్చని చెప్పారు. వైసీపీ బాధితులైన సాటి ఉద్యోగులకి అండగా నిలవాలని ఉద్యోగులను ఆయన కోరారు.

# హైకోర్టులో రాఘురామకృష్ణరాజుకు చుక్కెదురు

హైదరాబాద్: ఎంపీ రాఘురామకృష్ణరాజుకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైం ది. గచ్చిబౌలి పీఎస్‌లో దాఖలైన కేసు కొట్టే యాలని క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా.. కోర్టు పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్టు పేర్కొంది. వివరాల ప్రకారం.. రఘురామకృష్ణరాజు ఇంటి వద్ద విధి నిర్వహణలో ఉన్న ఇంటెలి జెన్స్ కానిస్టేబుల్‌ను ఇంట్లో నిర్బంధించి దాడి చేశారన్న విషయంలో గచ్చిబౌలి పీఎస్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలో కేసు కొట్టివేయాలని క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా, పిటిషన్‌పై విచారణలో భాగంగా.. కోర్టులో పోలీసులు కీలక వ్యా ఖ్యలు చేశారు. సందర్భంగా పోలీసులు.. ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్‌ను ఇంట్లో నిర్బంధించి దాడి చేశారని కోర్టుకు తెలిపా రు. ఈ విషయంలో తమ వద్ద తగిన ఆధారాలు ఉన్నాయని కోర్టుకు చెప్పారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని పోలీసులు స్పష?టం చేశారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సస్పెండ్ అయ్యారని తెలిపారు. దీంతో, పోలీసుల వాదనతో ఏకీభవించిన హైకోర్టు.. రఘురామ కృష్ణంాజు వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్టు పేర్కొంది.



# సంపాదకీయం

శనివారం 09-07-2022

## వెంటాడుతున్న ద్రవ్యోల్బణ భయాలు

డాలర్‌తో రూపాయి పతనం అదే పనిగా, హద్దు, ఆపు లేకుండా సాగిపోతున్నది.ద్రవ్యోల్బణం.. ఆర్థిక మాంద్యం.. ఈమధ్య తరచూ వింటున్న మాటలు. దేశ ఆర్థిక వ్యవస్థ ఆమాటకొస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఈ రెండు మాటలు వినిపిస్తే చాలు అంతా గందరగోళంగా మారిపోతుంది. ఇప్పుడు అదే జరుగుతోంది. ధరలు పెరుగుతున్న వాతావరణం మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ద్రవ్యోల్బణం తగ్గిందని చెబుతున్నారు. ప్రస్తుతం ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం ఈ రెండిటి పరిస్థితి ఎలా ఉందో తెలుసుకుందాం.. ప్రస్తుతం క్రూడాయిల్ ధరలు 9 శాతం తగ్గాయి. మలేషియాలో పామాయిల్ కూడా చౌకగా మారింది. పారిశ్రామిక లోహాలు కాపర్, స్టీల్, నికెల్ ధరలు కూడా క్షీణించడం కొనసాగుతోంది. అంటే, 4 నెలల క్రితం భారత ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు అకస్మాత్తుగా ప్రారంభమయ్యాయి. అవి ఇప్పుడు ముగింపు దశకు చేరుకుంటున్నట్టేనా? ఇప్పుడు ద్రవ్యోల్బణం భయం తొలగిపోతున్నట్లు అనిపిస్తోంది. కాస్త ఊపిరి తీసుకోవచ్చనిపిస్తోంది. ఎంత బ్యాడ్ టైమ్ గడిచిపోయింది. మరి ఇప్పుడు డిమాండ్ పెరుగుతుందా? ఇదీ ప్రశ్న. దీనికి జవాబు బహుశా కాకపోవచ్చు అని చెప్పుకోవచ్చు. ఎందుకో చూద్దాం..కమోడిటీ మార్కెట్‌లో అకస్మాత్తుగా అమ్మకాలు జరగడం తీవ్ర మాంద్యం సంకేతంగా పరిగణిస్తారు. మందగమనం ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం చెలాయిస్తే .. అప్పుడు పరిస్థితి మరింత దిగజారవచ్చు. 2008 లో, ప్రపంచం మొత్తం సరిగ్గా ఇలాంటి మాంద్యం చూసింది. 2008 వంటి పరిస్థితి కమోడిటీ మార్కెట్‌ను భయపెట్టింది. ఆ సంవత్సరం కూడా బంగారం, వెండి, ముడి చమురు రికార్డు స్థాయిల నుంచి బాగా పడిపోయాయి.ఈ భయం కారణంగా, మంగళవారం ముడి చమురు సుమారు 10 డాలర్లు పడిపోయింది. బంగారం 50 దాలర్లకంటే ఎక్కువ పడిపోయింది. ఇక వెండి ధరలు కూడా సుమారు 6 శాతం పడిపోయాయి. రాగి, అల్యూమినియం, జింక్‌లలో భారీగా అమ్మకాలు జరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో గోధుమలు, పామాయిల్, పత్తి, సోయాబీన్ ధరలు కూడా పడిపోయాయి.ఎందుకంటే మాంద్యం ప్రబలితే, వస్తువుల డిమాండ్ తీవ్రంగా ప్రభావితమవుతుంది. వస్తువులలో ఈ పతనం మాంద్యం చిహ్నంగా మార్కెట్ నిపుణులు చూస్తున్నారు. సాధారణ పరిస్థితుల్లోనూ నిత్యావసరాల ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉంటాయని అనుకున్నా.. 2008లో జరిగినట్లే? ఈసారి కూడా? జరిగే అవకాశాలున్నాయని అందరూ భయపడుతున్నారు. ఈ నెల 5 తేదీన డాలర్‌కు 79.37 రూపాయలై అత్యధమ స్థాయికి దిగజారిపోయింది. స్టాక్ మార్కెట్ 100 పాయింట్లు పతనమైంది. మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోడం కొనసాగుతున్నది. మనం దిగుమతి చేసుకొంటున్న బ్రెంట్ మార్క్ క్రూడాయిల్ ధర బ్యారెల్ 112.25 డాలర్లకు చేరుకొన్నది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదార్లు రూ.2149.56 కోట్ల షేర్లను ఉపసంహరించుకొన్నారు.దిగుమతుల భారం నానాటికీ పెరుగుతూ పోడమే రూపా యి మారకపు విలువను దెబ్బ తీస్తున్న ప్రధానమైన అంశమని స్పష్టపడుతున్నది. దేశ ఆదాయ వ్యయాల మధ్య వ్యత్యాసం అధికమవుతూ ఉన్నంత కాలం యీ పతనావస్థ నుంచి విముక్తి లభించదు. డాలరుతో రూపాయి విలువ త్వరలోనే 79.50 కి అటు పిమ్మట 80 రూపాయిలకు చేరుకోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పతనం కొనసాగుతున్న కొద్దీ దిగుమతుల వ్యయ భారం పెరిగిపోతుంది. క్రూడాయిల్, బొగ్గు దిగుమతుల ఖర్చు మితిమించడంతో జూన్ నెల వాణిజ్య లోటు రికార్డు స్థాయికి (25.63 బిలియన్ డాలర్లు ) చేరుకొన్నది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశ కరెంటు ఖాతా లోటు స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో 3.2 శాతానికి చేరుకొంటుందని అంచనా. 2021-22 ఆర్థిక సంవత్సరంలో యీ లోటు 1.2 శాతమే. డాలర్‌తో రూపాయి ప్రస్తుత పరిస్థితి ఇలా వుంటే తొమ్మిది నెలల క్రితం 2021లో యింతకంటే యే మాత్రం గొప్పగా లేదు. గత అక్టోబర్ 21న డాలర్‌తో రూపాయి విలువ రూ. 75.65. అప్పటికి 15 మాసాల్లో యెన్నడూ యెరుగనంత పతనం. అప్పుడు కూడా దేశ దిగుమతుల బిల్లు భరించలేని స్థాయికి చేరుకోడం వల్లనే రూపాయికి ఆ దుర్గతి పట్టింది.అందులో ప్రధాన పాత్ర క్రూడాయిల్ దే. అప్పటికి అంతర్జాతీయ మార్కెట్‌లో మనం కొనుక్కొనే క్రూడ్ ధర బ్యారెల్ 84.38 డాలర్లు. దిగుమతుల వ్యయం డాలర్లలో భరించవలసి వుంటుంది. ఆ ఖర్చు పెరిగే కొద్దీ డాలర్ల అవసరం పెరిగి రూపాయితో దాని విలువ యెగబాకుతుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడ్ 70-75 డాలర్ల వద్ద ఉంటే భారత ఆర్థిక వృద్ధి గణనీయంగా పెరుగుతుందనుకొన్నారు. డాలర్ తో ఇతర కరెన్సీల విలువలకు అనేక కారణాలుంటాయి. మనం యేయే దేశాల నుంచి సరకులు దిగుమతి చేసుకొంటామో ఆయా దేశాల కరెన్సీల విలువల ప్రభావమూ దానిపై పడుతుంది. చైనా నుంచి చేసుకొనే దిగుమతులపై అమెరికా సుంకాలు పెంచితే దాని వల్ల సైతం ప్రభావితమవుతుంది. మన షేర్ మార్కెట్లలోకి విదేశీ పెట్టుబడుల రాకడ పోకడల ప్రభావం అమితంగా ఉంటుంది.ఈ యేడాది యింత వరకు 28.4 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వెనక్కు వెళ్లిపోయాయి. 2008 అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభంలో వెళ్ళిపోయిన పెట్టుబడుల కిమ్మత్తు 11.8 బిలియన్ డాలర్లు మాత్రమే. మన దేశానికి మామూలుగా జరిగే సరకుల రాకడకు ఉక్రెయిన్ యుద్ధం వల్ల అంతరాయం కలగడం కూడా రూపాయితో డాలర్ విలువ పెరగడానికి దోహదం చేస్తున్నది. క్రూడాయిల్‌ను రష్యా నుంచి చౌకగా దిగుమతి చేసుకొంటున్నప్పటికీ అది పరిమితమే. అందుచేత డాలర్‌తో రూపాయి విలువ పతనం కాకుండా అది ఆపలేకపోతున్నదనుకోవాలి. డాలర్‌తో రూపాయి విలువ వొక స్థాయి మీరి పడిపోతే దాని దుష్ప్రభావం దిగుమతులపై చూపి దేశంలో ధరలు విపరీతంగా పెరిగిపోతాయి. దానిని అరికట్టడానికి రిజర్వు బ్యాంకు తన వద్ద గల డాలర్లను కొంత వరకు మార్కెట్‌లోకి విడుదల చేస్తుంది. డాలర్ గిరాకీకి సరఫరాకు తేడా కొంత మేర తగ్గి రూపాయి ఆ మేరకు నిలబడుతుంది. అయితే ఈసారి ఆర్‌బిఐ యీ పనిని తగినంతగా చేయడం లేదని చెబుతున్నారు. ఫిబ్రవరి 25 నుంచి ఇప్పటి వరకు మన విదేశీ మారక నిల్వలు 40.94 బిలియన్ డాలర్లు తగ్గాయని సమాచారం. మొత్తం నిల్వలు 600 బిలియన్ డాలర్ల వరకు ఉంటాయని తెలుస్తున్నది. ప్రస్తుత ఉపద్రవం నుంచి రూపాయిని రక్షించడానికి బంగారం దిగుమతులను కూడా ప్రభుత్వం నిరుత్సాహపరుస్తున్నది. వాటిపై సుంకాన్ని 5 శాతం పెంచింది.

# పెద్ద తలకాయల సంగతేంటీ

విజయవాడ జూలై 8, పార్టీ పండుగ అంటే ఎవరైనా ఉత్సాహంగా ఏర్పాట్లు చేస్తారు. కానీ పార్టీ నుంచి ఒక పెద్ద తలకాయకు ఉద్వాసన చెప్పడానికి పార్టీ పండుగను వేదికగా చేసుకోరు. ఏ పార్టీ అయినా పార్టీ వార్షికోత్సవ సభలను, ప్లీనరీలను అత్యంత ఘనంగా జరుపుకుంటుంది. ఇందు కోసం విస్తృత ఏర్పాట్లూ చేస్తారు. అందులో అసహజమేమీ లేదు. అటువంటి సభలలో సదస్సులలో ఇతర పార్టీల నుంచి వచ్చి చేరే వారికి పార్టీ కండువాలు కప్పి తాము బలోపేతం అవుతున్నామని చాటుకుంటారు. అయితే వైసీపీ అధినేత జగన్ స్టైలే వేరు. ఆయన పార్టీని నడిపే తీరే వేరు వైసీపీ ప్లీనరీ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించిన జగన్.. పార్టీ అధికారంలో ఉన్న ఈ మూడేళ్లలో ప్లీనరీ నిర్వహించడం ఇదే తొలిసారి.అయితే ఈ ప్లీనరీలో చేరికలు లేవు, పార్టీ విజయాల సంబరాలు ఎలా ఉంటాయో తెలియదు. కానీ ఒక్కటి మాత్రం పార్టీ వర్గాల ద్వారా స్పష్టమౌతున్నది ఏమిటంటే పార్టీ గౌరవాధ్యక్ష బాధ్యతల నుంచి జగన్ తల్లి విజయమ్మను గౌరవంగా తప్పించడం. ఆమె రాజీనామాతో ప్లీనరీ సమావేశాలు ప్రారంభం అవుతాయని పార్టీ వర్గాలే అంటున్నాయి. నాగార్జున వర్సిటీ ఎదురుగా ఉన్న మైదానాన్ని ఇప్పటికే ప్లీనరీ కోసం సిద్ధం చేశారు. ప్లీనరీ నిర్వహణ కోసం 20 కమిటీలు వేశారు. ఒంగోలులో జరిగిన మహానాడు విజయంతో వైసీపీ ప్లీనరీని అంతకు మించి విజయవంతం చేయాలన్న పట్టుదలతో ఉన్న జగన్ ఇప్పటికే పార్టీ నేతలకు ఆ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ప్లీనరీకి సంబంధించి ఏర్పాట్లు ఎంతవరకూ వచ్చాయో ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి, హోమంత్రి తానేటి వనిత, మంత్రులు జోగి రమేష్ తదితరులు బుధవారం పర్యవేక్షించారు. ప్లీనరీ ఏర్పాట్లూ సన్నాహాల సంగతి పక్కన పెడితే పార్టీ గౌరవాధ్యక్షురాలిని'గౌరవం'గా సాగనంపేందుకే ప్లీనరీ ఏర్పాటు చేశారా అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఆమె చేతనే గౌరవాధ్యక్లురాలి పదవికి రాజీనామా చేయించి పార్టీ శాశ్వత అధ్యక్షుడిగా జగన్ ను ఏన్నుకునే కార్యక్రమానికి ఈ ప్లీనరీ వేదిక కాబోతున్నదని బెబుతున్నారు.సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ బై లాస్ ను ఎన్నికల సంఘం నిబంధనలు, నియమావళికి అనుగుణంగా మార్పులు చేయబోతున్నట్లు వెల్లడించడమే ఇందుకు సంకేతమని పరిశీలకులు అంటున్నారు. అంటే అర్థం ఏపీలో వైసీపీకి గౌరవాధ్యక్షురాలిగా ఉన్న విజయమ్మ, తెలంగాణలో ఆమె కుమార్తె స్థాపించిన వైఎస్సార్ టీపీకి కూడా గౌరవాధ్యక్షురాలిగా ఉన్నారు. ఇలా ఒకే వ్యక్తి రెండు రాష్ట్రాలలో రెండు పార్టీలకు గౌరవాధ్యక్షురాలిగా ఉండటం సరికాదని పరోక్షంగా చెప్పడంగానే భావించాలని పరిశీలకులు అంటున్నారు. ఇక పోతే పార్టీ గౌరవాధ్యక్షురాలిని తొలగించడం అన్నది పార్టీ బైలాస్ ను సవరిస్తే తప్ప సాధ్యం కాదు కనుక ఆమె చేతనే రాజీనామా చేయించాలని జగన్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ విషయమై తల్లికి ఇప్పటికే స్పష్టం చేసినట్లు చెబుతున్నారు. ఆమె కూడా అందుకు సుముఖత వ్యక్తం చేసిందంటున్నారు. కేవలం రాజీనామా విషయం ప్రకటించడానికే విజయమ్మప్లీనరీకి హాజరు కానున్నారని పార్టీ వర్గాలే చెబుతున్నాయి.అక్రమాస్తుల కేసులో జగన్ జైలులో ఉన్న సమయంలో పార్టీ బాధ్యతలను భుజస్కందాలపై వేసుకుని మోసిన తల్లి విజయమ్మ, సోదరి షర్మిలలను పార్టీకి దూరం పెట్టడంపై జగన్ పై విమర్శలు వెల్లువెత్తుతున్నా ఆయన పట్టించుకున్న దాఖలాలు లేవు. జగన్ తీరుతో విసిగి వేసారిన సోదరి షర్మిల తెలంగాణలో సొంత కుంపటి పెట్టుకున్నారు. కుమారుడి తీరుతో మనస్తాపానికి గురైె విజయమ్మ కూడా కుమార్తె వెంటే నడుస్తున్నారని వైసీపీ వర్గాలే అంతర్గత సంభాషణల్లో చెబుతున్నారు. ఇక ఇప్పుడు విజయమ్మ చేత పార్టీ గౌరవాధ్యక్షురాలి పదవికి రాజీనామా చేయించి ఆమెకు పార్టీతో ఎటువంటి సంబంధం లేకుండా చేయడమే లక్ష్యాన్ని జగన్ ప్లీనరీ వేదికగా నెరవేర్చుకోనున్నరని అంటున్నారు.

# ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎమ్మెల్యే

ఒంగోలు జూలై 8,మద్దిశెట్టి వేణుగోపాల్. దర్శి వైసీపీ ఎమ్మెల్యే. బూచేపల్లి శివప్రసాదరెడ్డి.. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే. బూచేపల్లి వెంకాయమ్మ.. ప్రకాశం జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్. అంతా వైసీపీ నేతలే. వెంకాయమ్మ కుమారుడే శివప్రసాదరెడ్డి. బూచేపల్లి వర్గానికి.. మద్దిశెట్టి వర్గానికి మూడేళ్లుగా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఎవరి వర్గం వారిదే. దర్శి వైసీపీలో ప్రస్తుతం రెండు పవర్ సెంటర్స్ ఉన్నాయి. అందుకే సమస్య వస్తే పెద్ద చర్చకు దారితీస్తోంది. పార్టీ పెద్దలు అనేకసార్లు సయోధ్యకు ప్రయత్నించినా.. పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. ఇప్పుడు అధికారుల బదిలీల విషయంలో రెండు వర్గాల మధ్య నిప్పు రాజుకుంది.జిల్లా పరిషత్ పరిధిలో ఓఖఆూలను బదిలీ చేశారు. సాధారణంగా మండలాల్లోని అధికారుల ట్రాన్స్‌ఫర్లు? సంబంధిత ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే.. వారి సిఫారసులకు అనుగుణంగా జరుగుతాయి. కానీ.. దర్శి, ముండ్లమూరు ఎంపీడీవోల బదిలీలు మాత్రం ఎమ్మెల్యే వేణుగోపాల్ ప్రమేయం లేకుండా జరిగిపోయాయట. తన సిఫారసు లేకుండా ఎవరినీ కదపొద్దని చెప్పినా.. పట్టించుకోలేదని గుర్రుగా ఉన్నారట ఎమ్మెల్యే. ఏకంగా పార్టీ పెద్దల దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్యే మద్దిలేటి ఆరోపణలపై బూచేపల్లి సైతం సీరియస్‌గా ఉన్నారట. దర్శి, ముండ్లమూరు ఓఖఆూల బదిలీల్లో తమ ప్రమేయం లేదన్నది బూచేపల్లి వాదన. ఎమ్మెల్యే ఎవరికీ సిఫారసు లేఖలు ఇవ్వలేదని.. అందుకే సాధారణ బదిలీల్లో వారిని కదిలించారనేది ఆయన చెబుతున్నారు.జిల్లాలో ఎంపీడీవోలను కదిలించడానికి ముందు పార్టీ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి ఆదిములపు సురేష్ దృష్టికి తీసుకెళ్లినట్టు బూచేపల్లి వర్గం వాదిస్తోంది. కాకపోతే దర్శిలో మాత్రం ప్రతీదీ రాజకీయ కోణంలో చూడటం వల్లే సమస్యలు వస్తున్నాయని ఎమ్మెల్యేపై ఎదురుదాడి మొదలుపెట్టారు. ఈ విషయంలో రెండు శిబిరాలు ఎవరి వాదన వాళ్లు వినిపిస్తున్నా.. ఇక్కడితో విడిచి పెట్టకూడదని రెండు వర్గాలు అనుకుంటున్నాయట. తాడేపల్లి వైసీపీ ఆఫీసులో నిర్వహించే కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల ఎమ్మెల్యేలు.. పార్టీ ఇంఛార్జుల సమావేశంలో దర్శి రగడను ప్రస్తావించే పనిలో ఉన్నారట ఎమ్మెల్యే మద్దిశెట్టి. అంత వరకు వెళ్లితే మేము ఊరుకుంటామా.. మా వాదన కూడా మాకు ఉందని చెబుతోంది బూచేపల్లి వర్గం.ఇంకోవైపు.. బదిలీల్లో భాగంగా అధికారులు ఎక్కడికక్కడ చేరిపోయారు. విధుల్లో మునిగిపోయారు. కాకపోతే దర్శి నియోజకవర్గంలోని ఆ ఇద్దరు అధికారులు మాత్రం తమ భవిష్యత్ ఏంటో తెలియక సందిగ్ధంలో ఉన్నారట. ట్రాన్స్‌ఫర్లను రివర్స్ చేస్తారా లేక సర్దుకుపోవాలని చెబుతారో పార్టీ కేడర్‌కు అర్థం కావడం లేదట. రెండు వర్గాలు తాడేపల్లికి ఫిర్యాదు చేసుకుంటే సమస్యను పార్టీ పెద్దలు ఎలా పరిష్కరిస్తారో అనే ఉత్కంఠ ఉంది. పైగా రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వాడీవేడీగా ఉండటంతో ఎవరూ వెనక్కి తగ్గడం లేదు. దర్శిలో తమ పట్టు నిలుపుకొనేందుకు గట్టిగానే ఉన్నారు. మరి.. దర్శి వైసీపీలో రానున్న రోజుల్లో రాజకీయం ఇంకెన్ని సెగలు రేపుతుందో చూడాలి.

# రైతుల్ని నిండా ముంచేసి మళ్లీ రైతు దినోత్సవాలా



**వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**

నెల్లూరు రైతులు బాగుండాలని మేం ఎప్పుడూ కోరుకుంటాం. అన్నదాతలకు తీరని అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వానికి రైతు దినోత్సవం జరుపుకునే అర్హత లేదని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. జగన్ రెడ్డి మూడేళ్ల పాలనలో రైతులను కుప్పకూల్చేశారు..ప్రభుత్వమే వారిని ముంచేసింది. దేశవ్యాప్తంగా అమలయ్యే అనేక వ్యవసాయ పథకాలను ఏపీలో లేకుండా చేసి రైతులకు తీరనిద్రోహం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మైక్రో ఇరిగేషన్ కు ఏడాదికి వెయ్యి, 1200 కోట్లు ఖర్చుపెట్టాం..ఈ మూడేళ్లలో ఎంత ఖర్చుపెట్టారు..ఆ పథకం ఊసే లేకుండా చేసేశారు. మా హయాంలో భూసార పరీక్షలు నిర్వహించి సూక్ష్మపోషకాలు ఉచితంగా అందజేశాం..ఆ కార్యక్రమాన్ని ఎందుకు నిలిపేశారు. వ్యవసాయ యాంత్రీకరణకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా అమలు చేసే స్కామ్ కు మేం ఏడాదికి రూ.400 కోట్లకు పైగా ఖర్చుపెడితే..ఈ రోజు దానిని ఎందుకు ఆపేశారని అన్నారు.మేం రెండేళ్లలో రైతురథం పథకం కింద 23 వేల ట్రాక్టర్లను ఇస్తే దానినీ నిలిపేశారు..మూడేళ్ల తర్వాత ఏదో నామమాత్రంగా కొన్ని ట్రాక్టర్లు ఇచ్చారు. రైతులను నిండా ముంచేసిన వైసీపీ ప్రభుత్వానికి రైతు దినోత్సవం అని పేరెత్తే అర్హత ఎక్కడిది. 9 గంటల వ్యవసాయ విద్యుత్ సరఫరాను 12 గంటలకు పెంచుతానని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి దానిని 7 గంటలకు తగ్గించారు..అందులోనూ ఏడు విడతలు కోతలే. మద్దతు ధర విషయంలోనూ రైతులు మునిగిపోయారు..ఒక్క నెల్లూరు జిల్లా రైతులే మూడేళ్లలో 3 వేల కోట్లు నష్టపోయారు. ఏపీలో రైతులు క్వింటాలుకు రూ.213 మద్దతు ధర నష్టపోయారని సీఏసీపీ కుండబద్దలు కొట్టినా మీకు సిగ్గులేదు. మైక్రో ఇరిగేషన్ ను వైసీపీ ప్రభుత్వం పడుకోబెట్టేసిందని అంతర్జాతీయ మీడియా సంస్థ బీబీసీ బట్టబయలు చేసినా మీలో చలనం లేదు. ఈ మూడేళ్లలో బడ్జెట్ లో వ్యవసాయ అనుబంధ రంగాలకు ఎంత కేటాయించారు..ఎంత ఖర్చుపెట్టారో శ్వేతపత్రం విడుదల చేయండి. మూడేళ్లలో రైతుల కోసం రూ.1.27 లక్షల కోట్లు ఖర్చుపెట్టామని, అందులో రూ.50 వేల కోట్లు ధాన్యం కొనుగోళ్లకు వెచ్చించామనే తప్పుడు ప్రకటనలను మానుకోండి. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే విషయంలో కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసినా జగన్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ముందుకే వెళుతోంది. మోటార్లకు మీటర్లను వేం ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోము..రైతులందరూ తిరగబడేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

# సంక్షేమ ప్రధాత వైయస్సార్ కు ఘన నివాళి

కడప జాతీయ కాంగ్రెస్ పార్టీ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 73వ జయంతి సందర్భంగా కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ శ్రేణులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెం విజయభాస్కర్, ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ లు మాట్లాడుతూ పేద ప్రజల ఆశాజ్యోతి రైతుల కోసం అహర్నిశలు పాటుపడిన వ్యక్తిగా రాజన్నను కొనియాడారు. ఆయన హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ గృహ కల్పన, ఉచిత విద్య, ఫీజు రియంబర్స్మెంట్, రైతులకు ఉచిత విద్యుత్ ఇటువంటివి పేదలకు ఉపయోగపడే సంక్షేమ ఫలాలు ఎన్నో అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిగా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తుదిశ్వాస వరకు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారని రాహుల్ గాంధీని ప్రధాని చేసేందుకు అహర్నిశలు కృషి చేసేవాడని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయ సాధన కోసం రాహుల్ గాంధీని దేశ ప్రధాని చేసేందుకు మేమంతా కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోర్ల శ్రీనివాసులు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఇల్లూరు కృష్ణారెడ్డి, జిల్లా మహిళ అధ్యక్షురాలు శ్యామలాదేవి, బీసీ సెల్ రాష్ట్ర నేత కోపూరు శ్రీనివాసులు, జిల్లా నాయకులు అయ్యవారయ్య, అలెక్స్ సురేష్, సంతోషమ్మ, గౌరీ, రాము, సాంబశివుడు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## బాలరాజుకు సొంత పార్టీ వైసీపీలోనే సెగ

ఏలూరు జూలై 8, 2019 ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వైసీపీ అత్యధిక మెజార్టీతో గెలిచిన నియోజకవర్గం పోలవరం. 42 వేల ఓట్లకుపైగా మెజార్టీతో నాలుగోసారి గెలిచారు తెల్లం బాలరాజు. అయితే ఎన్నికల తర్వాత నుంచి మారుతున్న పరిణామాలతో నియోజకవర్గంలో అధికారపార్టీ పరిస్థితి అయోమయంగా తయారయ్యింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలు, పునరావాస కల్పన గతంకంటే మెరుగ్గానే ఉన్నప్పటికీ.. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఆశించిన ఫలితాలను రాబట్టడంలో ఎమ్మెల్యే వెనకపడ్డారన్నది పార్టీ శ్రేణులు చెప్పేమాట. ఈ విషయంలో వైసీపీ లోకల్ లీడర్సే బాలరాజుపై అసంతృప్తితో ఉన్నట్టు చెబుతున్నారు.2004, 2009లో కాంగ్రెస్ నుంచి గెలిచిన బాలరాజు.. 2012లో జరిగిన ఉపఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచారు. 2014లో ఓడిపోయారు. 2019లో వైసీపీ నుంచి మళ్లీ గెలిచినా.. కేడర్‌పై పట్టుకోల్పోయారని ప్రచారం జరుగుతోంది. సీనియారిటీకి తగ్గట్టుగా ఎమ్మెల్యే పనితనం లేదని పార్టీ వర్గాలే చెవులు కొరుక్కుంటున్నాయట. పోలవరంలో అభివృద్ధి పనులను పట్టాలెక్కించలేకపోతున్నారని విమర్శిస్తున్నారు. ఏజెన్సీలో రహదారులు లేక, మౌలిక వసతులకు దూరమై.. పదే పదే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా చేయడం లేదన్నది స్థానిక కేడర్ చెప్పేమాట. 2014లో ఓడి.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిత్యం ప్రజలతో టచ్‌లో ఉన్న బాలరాజుకు 2019లో గెలిచిన తర్వాత ఏమైందో కేడర్‌కు అర్థం కావడం లేదట.పోలవరం నియోజకవర్గంలో ఏడు మండలాలు ఉంటే.. అందులో బాలరాజు సొంతమండలమైన బుట్టాయగూడెంలోనే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోలవరం, టి నరసాపురం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెంలో ఇతర పార్టీల నేతలకు ఎమ్మెల్యే ప్రాధాన్యం ఇస్తున్నారని వైసీపీ వర్గాలు చేస్తున్న ఆరోపణ. ఆ ప్రభావం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై పడినట్టు చెబుతున్నారు. పైగా పోలవరం వైసీపీలో ప్రస్తుతం గ్రూపులు ఎక్కవయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ గ్రూపులను ఎమ్మెల్యే సరిగ్గా హ్యాండిల్ చేయలేకపోయారని చెబుతారు. దాంతో చాలా మంది వైసీపీ లోకల్ లీడర్స్ గడప దాటడం లేదట.పక్కపార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇచ్చి.. వైసీపీలో మొదటి నుంచి ఉన్న వారిని విస్మరిస్తే వచ్చే ఎన్నికల్లో మొదటికే మోసం వస్తుందని పార్టీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయట. కోటకు బీటలు వారకముందే ఎమ్మెల్యే బాలరాజు స్పృహలోకి వస్తే.. అన్నీ గాడిలో పడతాయని? లేకపోతే పరిస్థితులు చెయ్యి దాటిపోతుందని హెచ్చరిస్తున్నారట. మరి.. బాలరాజు ఏం చేస్తారో చూడాలి.

# కేఈ దారెటు...?

కర్నూలు,జూలై 8, తెలుగుదేశం పార్టీలో క్షేత్రస్థాయిలో ఊపు వచ్చింది. కార్యకర్తల్లో జోష్ పెరిగింది. ఈసారి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకుంటామని కిందిస్థాయి కార్యకర్తలు చెబుతున్నారు. కానీ నేతలు మాత్రం ఇంకా ముందుకు రావడం లేదు. అందులోనూ ముఖ్యమైన నేతలు మౌనంగా ఉండటం పార్టీని ఇబ్బందుల్లో పడేస్తుంది. కర్నూలు జిల్లాల్లో ఫ్యాక్షన్ కు పెట్టింది పేరు. దశాబ్దాలుగా ఫ్యాక్షన్ రాజకీయాలు నడుస్తున్నాయి. గ్రూపులు గోల ఎక్కువగానే ఉంది. ప్రధాన రాజకీయ కుటుంబాలు పార్టీని బలోపేతం చేసేందుకు ముందుకు రావడం లేదు. బీసీ నేతగా ఎదిగిన కేఈ కృష్ణమూర్తి రాజకీయాల నుంచి తప్పుకోవడంతో ఆయన కుటుంబం టీడీపీలో ఒంటరి అయిందనే చెప్పాలి. ఎవరూ వారిని పట్టించుకోవడం లేదు. దశాబ్దాల నుంచి.... కేఈ కుటుంబం గత కొన్ని దశాబ్దాలుగా కర్నూలు జిల్లాలో రాజకీయం చేస్తూ వచ్చింది. ప్రత్తికొండ, డోన్ నియోజకవర్గాల్లో కేఈ కుటుంబం పోటీ చేస్తూ వస్తుంది. 2014 ఎన్నికల వరకూ ప్రత్తికొండ నుంచి కేఈ కృష్ణమూర్తి పోటీ చేసే వారు. టీడీపీకి బలమైన నియోజకవర్గం. ఇప్పటికి ఏడుసార్లు టీడీపీ విజయం సాధించింది. డోన్ లోనూ టీడీపీకి మంచి పట్టుంది. అక్కడ కూడా కేఈ కుటుంబం నుంచి కేఈ కృష్ణమూర్తి, కేఈ ప్రభాకర్ ఏడుసార్లు విజయం సాధించారు. అయితే ఈసారి డోన్ నియోజకవర్గం కేఈ కుటుంబాన్ని చంద్రబాబు దూరం చేశారు. డోన్ ఇన్ ఛార్జి పదవిని.... డోన్ టీడీపీ అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డిని చంద్రబాబు ప్రకటించారు. ఇది రాష్ట్రంలో తొలి ప్రకటన. ఈసారి సుబ్బారెడ్డికే టిక్కెట్ ఇస్తున్నట్లు ఆయన తేల్చారు. ఇది కేఈ కుటుంబానికి రుచించడం లేదు. తమ కుటుంబాన్ని డోన నుంచి దూరం చేసే కుట్ర జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. కేఈ ప్రతాప్ తాను ఈసారి డోన్ నుంచి పోటీ చేయనని ప్రకటించినా కేఈ ప్రభాకర్ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. డోన్ లో కేఈ కుటుంబానికి పట్టుంది. ప్రత్యేకమైన ఓటు బ్యాంకు ఉంది. అలాంటి చో ధర్మవరం సుబ్బారెడ్డికి టిక్కెట్ కన్ఫర్మ్ చూస్తూ చంద్రబాబు చేసిన ప్రకటన కేఈ కుటుంబానికి మింగుడు పడటం లేదు. ఆలూరులో కేఈ... దీంతో కేఈ ప్రభాకర్ ఆలూరులో పోటీ చేయాలని భావిస్తున్నారు. ఆలూరులోనూ కేఈ కుటుంబానికి బలమైన వర్గముంది. మరో వైపు ఇదే నియోజకవర్గంలో కోట్ల సుజాతమ్మతో పాటు మాజీ ఎమ్మెల్యే వీరభద్రగౌడ్ వర్గాలు కూడా బలంగా ఉన్నాయి. ఆలూరు లో కోట్ల సుజాతమ్మ పార్టీ కార్కక్రమాలను నిర్వహిస్తున్నారు. వరసగా ఇక్కడ రెండు సార్లు టీడీపీ ఓటమి పాలవుతుంది. ఒకసారి వీరభద్రగౌడ్, మరోసారి సుజాతమ్మ పోటీ చేసి వైసీపీ అభ్యర్థి గుమ్మనూరి జయరాం చేతిలో ఓటమి పాలయ్యారు. ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని కేఈ ప్రభాకర్ కోరుతున్నారు. ఎటూ ప్రత్తికొండ కేఈ శ్యాంబాబుకు కేటాయిస్తారు. తనకు ఆలూరు ఇవ్వాలని ఆయన గట్టి ప్రయత్నమే చేస్తున్నారు. కానీ పెద్దాయన నుంచి ఎటువంటి హామీ లభించడం లేదు. దీంతో కేఈ కుటుంబం మనస్తాపానికి గురయిందని చెబుతున్నారు. తనను ఆలూరు నియోజకవర్గ ఇన్ ఛార్జి చేయాలని కేఈ ప్రభాకర్ పట్టుబదుతున్నారు. దీనికి అధిష్టానం ఎటువంటి సంకేతాలు ఇవ్వకపోవడంతో కేఈ కుటుంబం గుర్రగా ఉంది. కిమ్మనకుండా ఉన్నా ఎన్నికల నాటికి బరస్ట్ అయ్యే అవకాశాలున్నాయి.



# లోటు లెక్కేంటీ...

విజయవాడ, జూలై 8, ఆర్థిక లోటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతోంది. తాజాగా ప్రధానమంత్రి భీమవరం వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి అందచేసిన విజ్ఞాపన పత్రంలో 34 వేల కోట్ల రూపాయల లోటు నిధులు విడుదల చేయాలని కోరారు. అయితే, ఈ లెక్కలను కేంద్ర ప్రభుత్వంతోపాటు, రాష్ట్ర బిజెపికూడా తోసిపుచ్చుతోంది. రాష్ట్ర విభజన జరిగిన తరువాత 2014-15లో లోటు 16వేల కోట్ల రూపాయలుగా తేల్చిన సంగతి తెలిసిందే. అలాగే తొలి ఐదేళ్ల కాలానికి సంబంధించి కూడా ఎప్పటికప్పుడు లోటు వివరాలు కేంద్రానికి అధికారులు నివేదిస్తూ నిధులు కోరుతున్నారు. మరోవైపు ఇటీవల రాష్ట్ర బిజెపి తయారుచేసిన నివేదికలో లోటు అంశాలపై అనేక వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. 2014-15లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 16000 వేల కోట్లరూపాయలను ఆ పార్టీ అంగీకరించడం లేదు. అప్పటిలోటు కేవలం 6,609 కోట్ల రూపాయలేననిచెబుతోంది. ప్రస్తుతం బిజెపిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు కూడా దీనినే బలపరుస్తుండటం విశేషం. ఆర్థికశాఖలో కూడా అత్యున్నత బాధ్యతలు నిర్వహించిన ఆయన అప్పట్లో ప్రభుత్వం రూపొందించిన నివేదికలో కీలకపాత్ర పోషించారని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. 2014 వరకు వివిధ స్థాయిలో పనిచేసిన ఆయన ఆ తరువాత చీఫ్ సెక్రటరీగా వ్యవహరిరచారు. ప్రస్తుతం ఆయన ఆర్థిక వ్యవహారాలపై బిజెపి ఏర్పాటు చేసిన కమిటీలో ఉన్నారు. ఈ కమిటీ కొత్తగా అమలు చేస్తున్న పథకాల వల్ల అయ్యే వ్యయాన్ని కూడా లోటుగా భరించాలని రాష్ట్రం కోరడాన్ని తప్పు పట్టింది.

## కాపుకు ఎదురు తిరిగిన కాంట్రాక్టర్లు

అనంతపురం, జూలై 8, రాష్ట్రంలో ఎక్కడన్నా అభివృద్ధి పనులు సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ ఎమ్మెల్యే పరిశీలించవచ్చు. అందులో ఎవరూ తప్పు పట్టరు. తన ప్రాంతంలో జరిగే పనుల గురించి ఆ మాత్రం శ్రద్ధ అవసరం కూడా. కానీ సంబంధంలేని ప్రాంతానికి వెళ్లి అక్కడి వారితో వాదులాటకు దిగితే ఎవరు మాత్రం మర్యాదగా వింటారు? వచ్చిన కారణం తెలిసినపుడు అక్కడివారికి విసిగెత్తి తిరగబడతారు. ఇదే అనుభవం ప్రభుత్వ విప్, వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు, రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామ చంద్రారెడ్డికి ఎదురయింది. కర్ణాటక రాష్ట్రంలోనూ, కర్నూలు జిల్లా పరిధిలోనూ జరుగుతోన్న తుంగభద్రద ఎగువ, దిగువ కాలువల (హెచ్ ఎల్సీ, ఎల్ ఎల్సీ) ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. బుధవారం కర్ణాటక, కర్నూలు జిల్లా పరిధిలో జరుగుతున్న పనులపై పెత్తనం చేయడానికి వెళ్లడమే కాకుండా పర్సంటేజీల కోసం కాంట్రా క్టర్లపై ఒత్తిడి తేవడంతో వారు ఆగ్రహించి ఎమ్మెల్యేపై ఎదురుతిరిగారు. అసలు ఇక్కడి పనులతో మీకు సంబంధమేమిటని నిలదీయడం కంటే అవమానం వేరొకటి వుండదు. తుంగభద్ర బోర్డు పరిధిలో జరిగే పనుల్లో చాలారోజులుగా ఎమ్మెల్యే కాపు జోక్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలు వున్నాయి. కాగా అధికార వైసీపీ ఎమ్మెల్యేలు ఇప్పటికే ఆయనను హెచ్చరించారని తెలిసింది. కాపు రామచంద్రారెడ్డి తుంగభద్ర ఎగువ, దిగువ కాలువల ఆధునికీకరణ పనులను పరిశీలించేందుకు బుధవారం వెళ్లారు. తుంగభద్ర ఎగువ కాలువలో(13 ప్యాకేజీలు) రూ.430 కోట్లు, ఎగువ కాలువలో రూ.500 కోట్లతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఎగువ కాలువ పనుల పరిశీలన అనంతరం దిగువ కాలువ పనులను చూసేందుకు కాపు వెళ్లారు. దిగువ కాలు వ పనులన్నీ కర్ణాటక, కర్నూలు జిల్లా పరిధిలో జరుగుతున్నాయి. అక్కడికి వెళ్లి, పర్సెంటేజీలు అడగటంతో కాంట్రాక్టర్లు ఎదురు తిరిగినట్లు తెలిసింది. ఒక ప్రజాప్రతినిధిగా పనులు పరిశీలించవచ్చు. కానీ ఆయన వేరే ఉద్దేశంతో వస్తున్నారు. తనకు పనుల్లో పర్సెంటేజీ ఇవ్వాలని ఆది నుంచి డిమాండ్ చేస్తున్నారని కొందరు కాంట్రాక్టర్లు మండిపడ్డారు. ఆధునికీ కరణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లలో ఎక్కువ మంది వైసీపీవారే. దీంతో తాము చేసే పనులపై పెత్తనం ఏమిటని రామచంద్రారెడ్డికి ఎదురు తిరుగుతున్నారు. ఈ వివాదం బుధవారం పతాక స్థాయికి చేరింది. కొందరు కాంట్రాక్టర్లు కాపుపై తిరుగుబాటు చేసి నిలదీశారు.నీ ఇష్టం వచ్చింది చేసుకో. మాదీ వైసీపీనే. నీకు దిక్కున్న చోట చెప్పుకో.. అని తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. మరికొందరు అక్కడి నుంచే నేరుగా ప్రభుత్వ సలహాదారుకు(సజ్జల రామకృష్ణారెడ్డి) ఫోన్ చేసి విషయం చెప్పినట్లు సమాచారం. ఒక ఎమ్మెల్యే కూడా కాపు రామచంద్రారెడ్డికి బుధవారం గట్టిగా వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఇక చేసేది లేక బుధవారం మధ్యాహ్నం కాపు తిరుగుముఖం పట్టినట్లు తెలిసింది.

## బోడ కాకరకాయతో భలే ప్రయోజనాలు

### -ఎన్నో వ్యాధులకు చెక్

బోడ కాకరకాయ ఉపయోగాలు తెలుసుకుందామా... కాకరకాయ జాతికి చెందినదే ఈ బోడ కాకరకాయ. దీనిని అడవి కాకరకాయ, లేదా ఆకాకరకాయలు అంటారు. కాకరకాయల మాదిరిగా పొడుగ్గా కాకుండా రౌండ్ గా ఉండి..చిన్న చిన్న బొడిపలుంటాయి. అయితే దీని ఖరీదు కాస్త ఎక్కువనే చెప్పాలి. ఇవి జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసంలో ఎక్కువగా దొరకుతాయి. బోడ కాకరకాయను ఆహారంలో తీసుకోవం వలన మధుమేహం , గుండె జబ్బులతో పాటు అధిక బరువు సమస్యను కూడా తగ్గించుకోవచ్చు అని చెబుతుంటారు. బోడకాకరలో ఫోలేట్స్ అధికశాతం ఉంటాయి. దీని వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు గర్భిణులు ఈ కాయను కూర చేసుకొని తింటే గర్భస్థ శిశువు ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే డయాబెటిక్ పేషంట్లకు సైతం బోడకాకర ఎంతో మంచిది. ముఖ్యంగా రక్తంలోని చక్కెర నిల్వలను తగ్గించడంలో బోడకాకర ఉపయోగపడుతుంది. బోడ కాకరకాయ సీజన్ వచ్చిందంటే చాలు చాలామంది దీని కూర చేసుకొని తినేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. దీన్ని కొన్ని ప్రాంతాల్లో 'ఆకాకరకాయ' అని కూడా పిలుస్తారు. ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో సేకరించే ఈ కాయ వర్షాకాలంలో విరివిగా లభిస్తుంది. ఎంత ధరైనా సరే వెచ్చించి తినేందుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్లో బోడకాకర కాయ ధర కిలో.200 నుండి 250 రూపాయల పైన పలికినా కస్టమర్లు కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. బోడకాకరతో పులుసు, వేపుడు కూర, పొడి చేసుకునేందుకు భోజన ప్రియులు ఇష్టపడతారు. కేవలం రెండు, మూడు నెలలు మాత్రమే లభించే బోడకాకరను గిరిజనులు అడవిలో సేకరించి మార్కెట్లో దళారులకు అమ్ముతుంటారు. ఇక బోడ కాకరలో పోషక విలువలతో పాటు ఔషధ విలువల కూడా మెండుగా ఉంటాయి. ముఖ్యంగా బోడకాకరతో పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు అధిక మోతాదులో ఉంటాయి. అలాగే దీని వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది.బోడకాకరలో ఫోలేట్స్ అధికశాతం ఉంటాయి. దీని వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు గర్భిణులు ఈ కాయను కూర చేసుకొని తింటే గర్భస్థ శిశువు ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది.

# ప్రధాన ఓడరేవు ఎక్కడా...

ఒంగోలు, జూలై 8, రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదేళ్లు పూర్తయినా.. ఇంకా కొత్త ఓడరేవు అంశం పరిష్కారం కావడం లేదు. విభజన చట్టంలోనే రాష్ట్రానికి ఒక ప్రధాన ఓడరేవును ఇస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. ఏ ప్రాంతమన్నది రాష్ట్రమే నిర్ణయించుకునే వెసులుబాటు కూడా కల్పించింది. దీంతో ముందుగా దుగరాజపట్నాన్ని, తరువాత రామాయపట్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసి కేంద్రానికి నివేదిక పంపించింది. దీనిపై అనేక అభ్యంతరాలు వ్యక్తం కావడం, కొత్త ప్రాంతాన్ని గుర్తించాలని కేంద్రం కోరడంతో రాష్ట్రంలో కొత్త ఓడరేవు వస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రామాయపట్నం ఓడరేవు కృష్ణపట్నం ఓడరేవుకు ఉన్న మార్కెటిరగ్ పరిధిలోకి వస్తుండడంతో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వాస్తవానికి రాష్ట్ర విభజనకు ముందుగానే 2012లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి రామాయపట్నంలో ఓడరేవును నిర్మించేందుకు ప్రతిపాదించారు. అయితే 2014లో రాష్ట్ర విభజన అనంతరం నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు దుగరాజపట్నాన్ని కేంద్రానికి ప్రతిపాదించారు. ఇది నెల్లూరు జిల్లాలోని ఇస్రో, పులికాట్‌కు దగ్గరగా ఉండడంతో కేంద్రం దుగరాజపట్నంపై అభ్యంతరాలు వ్యక్తం చేసింది. రక్షణశాఖకు చెందిన ఇస్రోకు భద్రతా సమస్యలు తలెత్తుతాయని, పులికాట్ సరస్సుకు కూడా కాలుష్యం బెడద తీవ్రమవుతుందని కేంద్రం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలోనే అప్పట్లో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రతిపాదించిన రామాయపట్నాన్నే జగన్ ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది.ఒక పోర్టుకు 30 కిలోమీటర్ల పరిధిలో మరో పోర్టు నిర్మించకూడదన్న నిబంధన ఉంది. కృష్ణపట్నం ఓడరేవుకు ఉన్న పరిధిలోనే రామాయపట్నం ఉండడంతో దీని నిర్మాణం ఎలా అన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. తరువాత కాలంలో దీనిని మరింతగా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల కృష్ణపట్నానికి 153 కిలోమీటర్ల విస్తీర్ణంలో మరో ఓడరేవు నిర్మించడం చట్టపరంగా సాధ్యం కాదు. ప్రకాశం జిల్లాలో ఉన్న రామాయపట్నం వాడరేవు నుంచి 90 కిలోమీటర్ల దూరంలో, కృష్ణపట్నం నుంచి 93 కిలోమీటర్ల దూరంలో ఉంది. అంటే కృష్ణపట్నంకు ఉన్న హక్కు విస్తీర్ణంలో 60 కిలోమీటర్ల లోపలికి రామాయపట్నం వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించాలంటే ముందుగా కృష్ణపట్నం ఓడరేవుకు అదనంగా కల్పించిన 123 కిలోమీటర్ల హక్కు విస్తీర్ణాన్ని రద్దు చేస్తూ కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుందని అధికారులు గతంలోనే ప్రభుత్వానికి నివేదించారు. ఈ చర్యకు ఉపక్రమిస్తే కృష్ణపట్నం యాజమాన్యం న్యాయస్థానానికి వెళ్లే పరిస్థితి కూడా ఉంటుందని వారు అంటున్నారు. ఇదే సమయంలో నాన్ మేజర్ పోర్టు అంశం కూడా కలిసొచ్చేదిగా కనిపించడం లేదు. రామాయపట్నాన్ని నాన్ మేజర్ పోర్టుగా రాష్ట్రం నోటిఫై చేసిందన్న కారణాన్ని చూపిస్తూ ప్రధాన ఓడరేవు నిర్మాణ డిమాండ్‌ను కేంద్రం పక్కనపెట్టింది. అందుకే ముందుగా రామాయపట్నాన్ని నాన్ మేజర్ పోర్టుగా చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాల్సి ఉంటుందని కేంద్రం చెబుతోంది. తాజాగా జరిగిన ఒక సమావేశంలో కూడా ఇదే అంశం ప్రస్తావనకు రాగా, కొత్త ప్రాంతం ఎంపిక అన్నదాన్ని కేంద్రం పునరుద్ఘాటించినట్లు తెలిసింది.

# పేదల ఆరాధ్యదైవం వైఎస్సార్



### జనం కోసం ఎందాకైనా పోరాడిన యోధుడు వైఎస్
### పేదలకు ప్రాణం పోసిన 'ఆరోగ్యశ్రీ' మంతుడు
### వైఎస్సార్ కు నివాళులర్పించిన కాంగ్రెస్ నేత నాగ సీతారాములు

సుజాతనగర్ కొందరి పుట్టుకకు అర్థం పరమార్థం ముందే రాసి ఉంటుంది దానికి నిదర్శనం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నేత నాగ సీతారాములు అన్నారు. శుక్రవారం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ద్వారా పేద విద్యార్థులు కూడా కార్పొరేట్ స్థాయి చదువులు చదివేలా చేసి ఉన్నతోద్యోగాల్లో చేరేలా చేసిన ఘనత ఆయనదన్నారు. ఏదైనా పెద్ద జబ్బు చేస్తే తమకు చావే గతి అనుకునే వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని అందించి ప్రజారోగ్యానికి భరోసానిచ్చిన మహనీయుడని, సంక్షేమాభివృద్ధి పథకాలతో తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని జ్ఞాపకంగా నిలిచిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో దేవుడిలా కొలువై ఉన్నాడన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కొద్ది కాలం మాత్రమే పాలించిన వైఎస్ పేదల సంక్షేమం కోసం తెచ్చిన పలు పథకాలు, తీసుకున్న నిర్ణయాలు చూస్తే ఇలాంటి నాయకుడు ఇక ముందు రారనేది స్పష్టంగా తెలుస్తోంది. రాజకీయ పాలకుడికి మనసుంటే ప్రజలకు ఎంత మేలు చేయవచ్చో అవన్నీ చేసి చూపించారు. జమ్మలమడుగులో 1949 జూలై 8న జన్మించిన వైఎస్ రూపాయి డాక్టర్‌గా ప్రజల ప్రేమాభిమానాలు పొందారు. డాక్టర్‌గా ప్రజల నాడి తెలిసిన వైఎస్సార్ 1978లో రాజకీయ అరంగేట్రం చేశారు. సీఎంగా ఎన్నో సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. రూ.లక్ష కోట్ల వ్యయంతో కోటి ఎకరాలకు నీళ్లందించేలా ఒకేసారి 84 ప్రాజెక్టులను చేపట్టారు. 2009 నాటికే 16 ప్రాజెక్టులను పూర్తిగా.. 25 ప్రాజెక్టులను పాక్షికంగా వెరసి 41 ప్రాజెక్టుల ద్వారా 19.53 లక్షల ఎకరాలకు నీళ్లందించడంతోపాటు 3.96 లక్షల ఎకరాలను స్థిరీకరించారు. ఐదేళ్లలో 23.49 లక్షల ఎకరాలకు నీళ్లందించే ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా దేశ సాగునీటి రంగంలో రికార్డు నెలకొల్పారన్నారు. అనారోగ్యం పాలైన పేద కుటుంబాలు ఆపత్కాలంలో సాయం కోసం ముఖ్యమంత్రి కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇది ప్రజల ఆరోగ్యానికి ఎనలేని భరోసా ఇచ్చింది. ప్రమాదంలో గాయపడిన వారిని తక్షణమే ఆస్పత్రికి తరలించేలా 108 వాహనాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలను విస్తరిస్తూ 104 సర్వీసులను ప్రారంభించారన్నారు. వైఎస్సార్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ, 108, 104 సేవలను పలు రాష్ట్రాలు అనుసరించాయి. పేదరికం వల్ల ఏ ఒక్కరూ ఉన్నత చదువులకు దూరం కారాదనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి వైఎస్సార్ రూపకల్పన చేశారు. బాసర, ఇడుపులపాయ, నూజివీడు వద్ద ట్రిపుల్ ఐటీలను నెలకొల్పి లక్షలాది మందికి ఉన్నత చదువుల భాగ్యం కల్పించారు. రాజకీయ ప్రస్థానంలో ఎన్నికల్లో ఓటమి ఎరుగని నాయకులు ప్రపంచంలో అత్యంత అరుదుగా ఉంటారు. వారిలో దివంగత వైఎస్సార్ ముందు వరుసలో నిలుస్తారు. పులివెందుల నియోజకవర్గం నుంచి 1978, 1983, 1985 ఎన్నికల్లో అసెంబ్లీకి, కడప లోక్‌సభ స్థానం నుంచి 1989, 1991, 1996, 1998 ఎన్నికల్లో పార్లమెంట్‌కి, ఆ తర్వాత మళ్లీ పులివెందుల నుంచి 1999, 2004, 2009 ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేసి వరుసగా వైఎస్ రాజశేఖరరెడ్డి విజయాలు సాధించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 2004 మే 14న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వేదికపై నుంచే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేసి రైతు రాజ్యానికి వైఎస్ రాజశేఖరరెడ్డి పునాది వేశారు. పంటలు పండక విద్యుత్ చార్జీలు కట్టలేని రైతులపై నాడు టీడీపీ సర్కార్ రాక్షసంగా బనాయించిన కేసులను ఒక్క సంతకంతో ఎత్తి వేశారు. రూ.1,100 కోట్ల వ్యవసాయ విద్యుత్ బకాయిలను మాఫీ చేశారు. దాదాపు 35 లక్షల పంపు సెట్లకుపైగా ఉచిత విద్యుత్ అందించారు. రూ.400 కోట్లతో మొదలైన వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ ఆ తర్వాత ఏడాది రూ.6 వేల కోట్లకు చేరినా ఉచిత విద్యుత్‌పై వెనక్కు తగ్గలేదు. వైఎస్ స్ఫూర్తితో పలు రాష్ట్రాలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాయి. పావలా వడ్డీకే రైతులకు రుణాలు అందించారు. పంటల బీమాను అమలు చేశారు. ఇన్‌ఫుట్ సబ్సిడీ అందించారన్నారు.

# విజ్ఞానవంతమైన సమాజం రూపుదిద్దుకోవాలి



### తొర్రూర్ మున్సిపల్ ఛైర్మన్ రామచంద్రయ్య
### లయన్ సేవా తరుణి ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

తొర్రురు జూలై 8 బాల్యం నుండే ఆరోగ్యంతోపాటు ఆలోచనతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసి అనేక సౌకర్యాలు ఏర్పాటు చేస్తుందని తొర్రూర్ మున్సిపాలిటీ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య తెలిపారు. లయన్స్ క్లబ్ అఫ్ తొర్రూర్ సేవా తరుణి కోశాధికారి చీదర నీలిమ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం దుబ్బ తండాలో మోడల్ అంగన్వాడీ కేంద్రంలో 200 మంది చిన్నారులకు ఇంగ్లీష్ వర్ణమాలకు సంబంధించిన పుస్తకాలను, పెన్సిలు అందజేసి చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి ఇ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని,అదే తరహాలో తొర్రూరులో సేవా తరుణి క్లబ్ ద్వారా సమాజంలో వివిధ వర్గాల వారికి ప్రయోజనం చేకూరే సేవలు అందిస్తున్నారని అన్నారు. అంగన్వాడీ చిన్నారులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే వర్ణమాల పుస్తకాలను అందించడం అభినందనీయమని చెప్పారు. బాల్యం ఆరోగ్యవంతంగా ఉంటేనే భావి జీవితం బాగుంటుందని భావించిన ప్రభుత్వం ఎప్పటికప్పుడు పౌష్టికాహారాన్ని అందజేస్తూ చిన్నారుల భౌతిక మానసిక ఎదుగుదలను, వయసుకు తగ్గ శారీరక మార్పులను అంగన్వాడీ టీచర్ల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తల్లిదండ్రులకు తగిన జాగ్రత్తలను తెలియ బరుస్తున్నారని తెలిపారు. పుట్టినరోజులు, వివాహ దినోత్సవ సందర్భంగా పది మందికి ప్రయోజనం చేకూరే ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతృప్తిని కలిగిస్తుందని ప్రతి ఒక్కరూ సేవాతరుణి సభ్యుల తీరును స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతం కోసం చేస్తున్న కార్యక్రమాలకు దాతలు కూడా అండగా నిలిచి విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణం కోసం సహకారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం క్లబ్ అధ్యక్షురాలు వజినెపల్లి దీప అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ధరావత్ సునీత జైసింగ్, సిడబ్ల్యూసి చైర్ పర్సన్ డాక్టర్ ఎస్. నాగవాణి, ఏసిడిపివో ఇందిరమ్మ, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ వి. శారద, ప్రధాన కార్యదర్శి వజినెపల్లి శైలజ, సభ్యులు పద్మావతి, మాధవి, సౌజన్య, అంగన్వాడి టీచర్లు శారద, ప్రమీల, లక్ష్మి ,పద్మ ,లలిత, సుకన్య ,సునిత, సాంబలక్ష్మి ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### నదిలో కొట్టుకుపోయిన కారు.. 9 మంది మృతి

డెహ్రాడూన్ జూలై 8 ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నైనిటాల్ జిల్లా రామ్‌నగర్ ప్రాంతంలో ఓ కారు నదిలో కొట్టుకుపోయింది. దీంతో 9 మంది మృతిచెందారు. శుక్రవారం తెల్లవారుజామున రామ్‌నగర్ వద్ద ధేలా నది వరద నీటి ప్రవాహంలో ఎర్టిగా కారు కొట్టుకుపోయింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది మరణించారు. ఓ బాలిక సహా ఇద్దరిని పోలీసులు రక్షించారు. ప్రమాద సమయంలో కారులో 11 మంది ఉన్నారని చెప్పారు. మృతులంతా పంజాబ్‌కు చెందిన వారేనని వెల్లడించారు. ఉదయం 5 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు.

## లారీని ఢీకొన్న కర్ణాటక ఆర్టీసీ బస్సు

చిత్తూరుచిత్తూరు జిల్లా పూతలపట్టు నాయుడుపేట ప్రధాన రహదారిలోని పూతలపట్టు ఫ్లైఓవర్ వద్ద ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 12 మందికి గాయాలు అయ్యాయి. పీలేరు నుండి బెంగళూరు వైపు వెళుతున్న లారీని వర్షంలో గమనించని కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్ లారీ ని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. పూతలపట్టు పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు

## రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

విజయవాడఏపీ లో రాష్ట్ర వ్యాప్తంగా వైస్సార్ జయంతి వేడుకలు వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. విజయవాడలో దివంగత నేత రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ శాశనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాస్, ఎశ్రీఇ రుహుల్లా, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇంచార్జి దేవినేని అవినాష్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి.ఈ సందర్భంగా వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ దివంగత నేత రాజశేఖర్ రెడ్డి రాష్ట్రానికి చేసిన పనులు అమోఘమని ప్రతి రైతు కి అండగా ఉండే నేతగా గుండెల్లో స్థిర స్థాయిగా ఉన్నారని కొనియాడారు. గుంటూరు జిల్లా లో జరుగుతున్న ప్లీనరీ సమావేశానికి వైసీపీ నాయుకులు విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం సభా ప్రాంగణానికి బయల్దేరారు..

# వైఎస్సార్ అందిరి వాడు

### వైయస్ విజయమ్మ



అమరావతిప్లీనరీలో వైఎస్ విజయమ్మ మాట్లాడారు. నా జీవితంలో ప్రతి మలుపు ప్రజాజీవితాలతో ముడి పడి ఉంది అని వైఎస్ఆర్ చెబుతుండేవారు. రాజశేఖర్ రెడ్డి నా వాడే కాదు..మీ అందరీ వాడు. మీ అందర్నీ అభినందించడానికి, ఆశీర్వదించడానికి వచ్చాను. రాజకీయ పార్టీలు అధికారం కోసం పుడతాయి. వైఎస్ఆర్ లేడని తెలిసి 700 మంది ప్రాణాలు వదిలారు. కోట్లాది మంది అభిమానం నుంచి వైఎస్ఆర్ సీపీ పుట్టింది. దేశంలోని వ్యవస్థలు అన్నీ దాడి చేసినా..మనం చేస్తున్నది న్యాయం, ధర్మం అని..కష్టాలు బాట ముందని తెలిసినా కూడా కన్నీళ్లను తుడవటానికి వైఎస్ఆర్ సీపీ పుట్టింది. ఎన్నో కష్టాలను , నిందలను ఎదుర్కొని వైఎస్ఆర్ కుటుంబం నిలిచింది. అధికార శక్తులన్నీ జగన్ పై విరుచుకుపడ్డ బెదరలేదు. ఎన్నో విలువలు, మానవత్వంతో వైఎస్ఆర్ సీపీ పురుడు పోసుకుందని అన్నారు. నిజాయితీగా ఆలోచన చేసే వ్యక్తిత్వం జగన్ ది. లక్షా 60వేల కోట్లు ప్రజలకు ప్రత్యక్షంగా వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అందించింది. గడపగడపకు ఎమ్మెల్యేలను పంపుతున్నాడంటే..తాను మంచి చేశానని నమ్మడం వల్లనే పంపుతున్నాడు. నాడు - నేడు తో బడుల రూపురేఖలు మారిపోతున్నాయి. మానవత్వంతో, మనసుతో చేసే పాలన. జగన్ ఓర్పు, సహనంతో ఎంతో ఎత్తుకు దిగారని అన్నారు.పరిపాలనలో జగన్ విప్లవం తెచ్చారు. జగన్ చెప్పినవే కాకుండా...చెప్పనవి కూడా చేస్తున్నారు. రాష్ట్రంలో పేద తల్లులు, పేద తండ్రులు మీ బిడ్డలను జగన్ చేతిలో పెట్టండి...జగన్ మీ బిడ్డలకు మంచి భవిష్యత్తు ఇస్తాడు. పేద బిడ్డల భవిష్యత్తు జగన్ చూసుకుంటారని అన్నారు.రైతుల కలలను జగన్ నెరవేరుస్తాడు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. వైఎస్ జగన్ మాస్ లీడర్. దుర్గ ఫ్లైఓవర్ను చంద్రబాబు ఐదేళ్లో పూర్తి చేయలేకపోయారు. జగన్ సీఎం అయ్యాక పూర్తి చేశారు. జగన్ యువతకు రోల్ మోడల్. మీ అందరి ప్రేమను పొందిన జగన్ను గర్వపడుతున్నా. కడప ప్రజలు మొదటి నాతో ఉన్నందకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా. ఉమ్మడి రాష్ట్రం వైఎస్ఆర్ను మహామనిషిని, మహర్షిని చేసింది. రాజశేఖర్ రెడ్డిగారు ఉన్నప్పుడు నిత్యం ఏం చేయాలి..ఏం చేయాలని ఆలోచించేవారు. వైఎస్ఆర్ అంటే ప్రజలకు ప్రాణాలు పోయేంత ప్రేమఅని అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పరిపాలనలో సీఎం జగన్ విప్లవం తెచ్చారు. ప్రజలకు, వైఎస్ కుటుంబానికి 45 ఏళ్లు. ఇకపై కూడా నా అనుబంధం కొనసాగాలి. జగన్ మనసుతో చేసే పాలన నా కళ్లారా చూస్తున్నాని ఆమె అన్నారు.

# ఏలూరులో వైఎస్సార్ జయంతి వేడుకలు

ఏలూరు మహానేత వైయస్సార్ ప్రజల మదిలో చిరస్మరణీయంగా నిలిచిపోయారని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. శుక్రవారం స్థానిక బేల్ బ్రిడ్జి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద వివి నగర్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన వైయస్సార్ జయంతి వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా దివంగత మహానేత వైయస్సార్ విగ్రహానికి నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఏఎంసీ చైర్మన్ మంచెం మైబాబు పూలమాలలు వేసిన ఘన నివాళులుర్పించారు.అనంతరం కేక్ ను కట్ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ చరిత్ర ఉన్నంత కాలం ప్రజల హృదయాల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ, పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తును ముందుగానే దర్శించిన వ్యక్తి మహానేత వైఎస్సార్ అని, ఆయన ఆదర్శవంతమైన పాలనతో దేశంలోని లెజెండ్ గా వీలిచారన్నారు. వైయస్సార్ శకాన్ని ముందు నడిపిస్తున్న మన ప్రియతమ ముఖ్యమంత్రి పాలనలో తామందరం పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని సారధ్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా చొరవ తీసుకోవడంతో పాటు, పార్టీ బలోపేతానికి తామందరూ కృషి చేస్తామని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్ స్థానిక నాయకులు దేవయ్య, కిరణ్, మల్లేశ్వరరావు వివి నగర్ యువత పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రమాదంలో పడ్డ భూ గ్రహాన్ని పచ్చదనంతో రక్షించుకుందాం



కర్నూలు జూలై 8: ప్రమాదంలో పడ్డ భూ గ్రహాన్ని పచ్చదనంతో రక్షించుకుందామని కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు ప్రజలకు పిలుపు నిచ్చారుఅజాదీ కా అమృత్ మహోత్సవ్, 73వ వనమహోత్సవం లో భాగంగా శుక్రవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో బెంగళూర్ హైవేలో 34.56 హెక్టార్ల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న పుల్లయ్య పార్క్ నగర వనాన్ని మొక్కలు నాటి కలెక్టర్ ప్రారంభించారు..ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారికంగా 1950లో అప్పటి కేంద్ర వ్యవసాయ మంత్రి కేఎం మున్షీ వన మహోత్సవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కలెక్టర్ పేర్కొన్నారు . అప్పటినుండి జులై మొదటి వారంలో మనం మహోత్సవం కార్యక్రమం జరుపుకుంటున్నామని తెలిపారు. 4.5 బిలియన్ సంవత్సరాల కిందట భూమి ఏర్పడిందని,అప్పటినుండి అన్ని జీవరాశులు ఈ భూగ్రహంలో జీవిస్తున్నాయన్నారు . 3.5 బిలియన్ సంవత్సరాల కిందట మానవుని రాకతో అన్ని జీవ రాశులు జీవించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు..ప్రమాదంలో పడ్డ భూ గ్రహాన్ని పచ్చదనంతో రక్షించుకోవలసిన అవసరం ఉందని కలెక్టర్ పిలుపునిచ్చారు.. అందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. ఏడాది కోనాడు వన మహోత్సవం జరుపుకోవటం కాదని, ప్రతిరోజు మొక్కల పెంపకం పట్ల శ్రద్ధ చూపించి, వాటిని సంరక్షించినపుడే దానికి సార్థకత ఉంటుందని కలెక్టర్ తెలిపారువిద్యార్థులు భావి భారత పౌరులుగా భూ గ్రహాన్ని రక్షించుకోవడం లో భాగంగా మొక్కలు పెంపకం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కలెక్టర్ కోరారు . కరోనా సమయంలో ఆక్సిజన్ అందక ఎంతోమంది చనిపోయారని, ఆక్సిజన్ విలువ అప్పుడు తెలిసిందని కలెక్టర్ గుర్తుచేశా రు.. ఆక్సిజన్ ఉత్పత్తికి తోడ్పడే మొక్కలను నాటి భూమిని రక్షించుకోవాల్సిన అవసరం విద్యార్థుల పైన కూడా చాలా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. వచ్చే వారంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పదివేల మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టాలు ఉన్నామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అడవుల శాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించి, పచ్చదనం పెంపులో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారుకర్నూలు నగరపాలక సంస్థ

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపులో భాగస్వాములు కావాలి

### 73వ వన మహోత్సవం సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చిన కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు

మున్సిపల్ కమిషనర్ మాటలు భార్గవ్ తేజ్ మాట్లాడుతూ ఇళ్లలోనూ, ఆవరణల్లోనూ, అన్ని ప్రదేశాల్లో మొక్కలను పెంచి గ్రీనరీ ఛాంపియన్లుగా కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి మొక్కలు పెంపకం ఒక్కటే మార్గమని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక చెట్టును నాటి దానిని సంరక్షించుకునే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తమను తాము ఉత్తేజిత పరుచుకోవడంతోపాటు ,ఇతరులను కూడా మొక్కలు నాటే దిశగా ప్రోత్సహించాలని సూచించారుకన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ రామకృష్ణ మాట్లాడుతూ నగరానికి దగ్గర్లో ఉన్న రిజర్వు ఫారెస్ట్ ను రక్షించుకోవడానికి నగరవనాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.. జియోగ్రాఫికల్ ఏరియా లో 1/3 గ్రీనరీ ఉండాల్సిన అవసరం ఉందన్నారు..ఆ మేరకు పచ్చదనం పెంపుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.. మొక్కల పెంపకం పట్ల పిల్లలు అవగాహన పెంచుకోవాలని సూచించారుడీఎఫ్ఓ (టెరిటోరియల్) సుమన్ బెనివాల్ మాట్లాడుతూ 73వ వనమహోత్సవంలో భాగంగా 34.56 హెక్టార్ల విస్తీర్ణంలో పుల్లయ్య పార్క్ నగర వనాన్ని అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి జిల్లాలో పచ్చదనం పెంపుకు సహకరించాలని ఆమె కోరారు..తొలుత అధికారులు అందరూ మొక్కలు నాటారు..కలెక్టర్ విద్యార్థులకు మొక్కలను అందచేసి, వాటిని నాటి సంరక్షించాలని సూచించారుఈ కార్యక్రమంలో సోషియల్ ఫారెస్ట్రీ డిఎఫ్ఓ ప్రసూన, డిఎఫ్ఓ ఫ్లయింగ్ స్క్వాడ్ శివ శంకర్ రెడ్డి, అటవీ శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ రామచంద్ర రావు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# పేద ప్రజల గుండె చప్పుడు డా" వైఎస్ రాజశేఖర రెడ్డి



:- యం సుధాకర్ బాబు

కర్నూలు జూలై 08 -: పేద ప్రజల గుండె చప్పుడు దివంగత ముఖ్యమంత్రి వర్యులు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి గారని కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు యం సుధాకర్ బాబు గారు అభిప్రాయపడ్డారు . డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని దేశం గర్వించదగ్గ నాయకుడిగా స్వచ్ఛమైన పాలన ప్రజలకు అందించారని అలాగే కాంగ్రెస్ అధిష్ఠానం రాజశేఖర రెడ్డి గారికి పూర్తి స్వేచ్ఛ నిచ్చిందని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దేశంలో ఎక్కడా అమలు చేయని పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని ఆయన ఎప్పటికీ కాంగ్రెస్ వాది అని, వితంతు వృద్ధాప్య వికలాంగ పెన్షన్లను రెండు వందల నుంచి రెండువేల రూపాయలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిరుపేదలకు ఎంతో ఆసరాగా నిలిచిందని, పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి దేశంలోని ముఖ్య మంత్రులకు ఆదర్శంగా నిలిచారని కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ బాబు గారు పార్టీ కార్యాలయంలో జరిగిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి 73 వ జయంతి కార్యక్రమంలో కార్యకర్తల సమావేశంలో పై విధంగా ఆయన సేవలను కొనియాడారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న కిసాన్ సెల్ అధ్యక్షులు పోతుల శేఖర్ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు అభినాయుడు సత్యనారాయణ గుప్తా సౌల్ రాజు బివి సుబ్రమణ్యం ఐఎన్టియుసి ప్రధాన కార్యదర్శి ఎం సుంకన్న గిరిధర్ రామకృష్ణారెడ్డి కేశవ రెడ్డి కొండల్ మహిళా కాంగ్రెస్ శ్రీమతి యస్ సారమ్మ యస్ ప్రమీల కే వెంకట లక్ష్మి కుమారమ్మ మద్దమ్మ ఎల్లమ్మ మొదలగు వారు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

– వై ఎస్సార్ సీ పీ ఎస్సీ సెల్, కేదార్ నాథ్ మాదరాపు

దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు వై ఎస్సార్ సీ పీ ఎస్సీ సెల్ కేదార్ నాథ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్లీనరీ సమావేశం లో భాగంగా గుంటూరు లో దివంగత ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి, మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి ఎస్సి సెల్ కేదార్ నాథ్ మాదరాపు మాట్లాడుతూ మహానేత ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో సుభిక్షమైన పాలన సాగుతోందని అన్నారు. ఆనాడు విద్యార్థులకు దివంగత నేత అనేక సంస్కరణలు తీసుకొచ్చి ఫీ జు రీయింబర్స్మెంట్ వంటి పథకాలను అమలు చేస్తే, ఆయన తనయుడు ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి అమ్మ ఒడి, విద్యా కానుక, వసతి దీవెన వంటి కార్యక్రమాలు అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కో - ఆప్షన్ మెంబర్ శ్రీ రాములు మాట్లాడుతూ మహానేత జన్మదినోత్సవం సందర్భంగా నగరంలో అనేక ప్రజాపయోగ కార్యక్రమాలు జరగడం సంతోషంగా ఉందన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతిస్తూ ఆనాడు రాజశేఖరరెడ్డి పాలన సాగిస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి నాడు నేడు కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. వై ఎస్సార్ సీ పీ బీ సీ సెల్ పర్ల సూరీడు మాట్లాడుతూ దివంగత నేత మార్గనిర్దేశనంలో మరిన్ని విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 15 వ వార్డ్ సెక్రటరి లు వసంత్, జేశ్వత్, రాముడు, రమేష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి



ఓర్వకల్లు , జూలై, 08 : నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ళ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఓర్వకల్ మండలం నన్నూ రు గ్రామ సమీపంలో కేంద్రంలోని నవరత్నాలు -

-:కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు

పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీ లేఅవుట్ లో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణాల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.నన్నూరు జగనన్న కాలనీ లే అవుట్ లో 470 ఇళ్ళ నిర్మాణం జరుగుతొందని, బిలో బేస్మెంట్ స్థాయిలో 175, పునాది స్థాయిలో 283, రూఫ్ కాస్ట్ స్థాయిలో 5, రూఫ్ లెవెల్ లో 3, నాట్ స్టార్టెడ్ దశలో 4 ఉన్నాయని అధికారులు వివరించారు.. నాట్ స్టార్టెడ్ ఇళ్లను త్వరగా ప్రారంభించాలని,బిలో బేస్మెంట్ స్థాయిలో 175 ఇళ్ళ ను పునాది స్థాయికి త్వరితగతిన తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. కాలనీ లో చివరి ఇళ్లకు విద్యుత్ వసతి అందే విధంగా కరెంట్ పోల్స్ ఏర్పాటు చేయాలని నన్నూరు సర్పంచ్ బ్రహ్మయ్య కోరగా కలెక్టర్ కాలనీ లోని అన్ని ఇళ్లకు ఉపయోగపడే విధంగా పోల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

# అన్నయ్యకి ఖైదీ సెంటిమెంట్ వర్కౌట్ అయ్యేనా?

మెగాస్టార్ చిరంజీవికి సరైన కమర్శియల్ సక్సెస్ పడి చాలా కాలమవుతోంది. కంబ్యాక్ మూవీ 'ఖైదీ నెంబర్ 150' తర్వాత అన్నయ్యకి బ్లాక్ బస్టర్ పడలేదు. భారీ బడ్జెట్ తో తెరకెక్కించిన 'సైరా నరసింహారెడ్డి 'భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన సినిమా వాటిని అందుకోవడంలో పరిపూర్ణత కనిపించలేదు. పీరియాడిక్ సినిమా మెగాస్టార్ అభిమానుల అంచనాల్ని అందుకోలేకపోయింది.ఓ గొప్ప విప్లవ యోధుడి జీవిత కథని తీసుకుని తెరకెక్కించినా ఉయ్యాలవాడగా చిరుని జీర్ణించుకోవడంలో కొన్ని లోపాలు కనిపించాయి. భారీ కాన్వాస్ పై చిత్రం తెరకెక్కిన సైరాలో ఏదో అసంతృప్తి అభిమానుల్ని వెంటాడింది. కమర్శియల్ సినిమా కాకపోవడం సహా ఎన్నో కారణాలు బాస్ వేగాన్ని తగ్గించినట్లు కనిపించింది.అటుపై ఇటీవలే రిలీజ్ అయిన 'ఆచార్య' ఇంకెలాంటి ఫలితాలు సాధించిందో కూడా తెలిసిందే. చరణ్-చిరంజీవి కలిసి నటించిన సినిమా ఇంత ఘోరంగా ఆడుతుందా? అని పబ్లిక్ గానే విమర్శలు గుప్పించారు. తొలిసారి చిరంజీవి సోషల్ మీడియాలో ట్రోలింగ్ కి సైతం గురయ్యారు. అంటే 'ఆచార్య' ఫలితానికి ఈ ట్రోలింగ్ అనేది ఓ నిదర్శనం. ఇలా రెండు సినిమాలు మెగా అభిమానుల్లో తీవ్ర నిరాశ..నిస్పృహల్ని మిగిల్చాయి.ఇప్పుడు అభిమానులు సక్సెస్ దాహంతో ఎదురుచూస్తున్నారు. ఆదాహాన్ని చిరంజీవి సరైన బ్లాక్ బస్టర్ ఇచ్చి తీర్చాల్సిన బాధ్యత అంతే కనిపిస్తుంది. అందుకే బ్యాక్ టూ బ్యాక్ ప్రాజెక్ట్ ల్ని లైన్ లో పెడుతున్నారు . 'గాడ్ ఫాదర్'..'వాల్తేరు వీరయ్య'..'భోళా శంకర్' ఆన్ సెట్స్ లో ఉన్నాయి. మెగాస్టార్ 154 టైటిల్ తో ఓ సినిమా రెడీ అవుతోంది.వీటిలో ముందుగా రిలీజ్ అయ్యేది 'గాడ్ ఫాదర్' . ఓ పాట మినహా షూటింగ్ మొత్తం పూర్తయింది. ఇటీవలే చిరు ఫస్ట్ లుక్ కూడా రిలీజ్ అయింది. మెగా అభిమానులకు ఆ పోస్టర్ బిగ్ ట్రీట్ ఇచ్చింది. అనయ్య కొట్టేలా ఉన్నాడనే సంకేతాలు ఫస్ట లుక్ పోస్టర్ తోనే పంపేసారు. తాజాగా మెగాస్టార్ అదిరిపోయే సెంటిమెంట్ తోనే థియేటర్లోకి వస్తున్నట్లు కనిపిస్తుంది.అదిగానీ వర్కౌట్ అయితే మెగతా ఫ్యాన్స్ ఆకలి తీరినట్లే. ఇండస్ట్రీ హిట్ సైతం ఖాయం అనే టాక్ వినిపిస్తుంది. మరి ఆ సెంటిమెంట్ ఏంటి ? వివరాల్లోకి వెళ్లాల్సిందే. 'గాడ్ ఫాదర్' లో చిరంజీవి ఖైదీ గా నటిస్తున్నారు. సరిగ్గా ఇదే సెంటిమెంట్ ఇప్పుడు మెగాస్టార్ ని బయటపడేసే ఛాన్స్ కనిపిస్తుంది. కెరీర్ ఆరంభంలోనే 'ఖైదీ' టైటిల్ సినిమాతో చిరు ఇండస్ట్రీ హిట్ అందుకున్నారు.ఆ తర్వాత 'ఖైదీ నెంబర్ 786' తో మరో బ్లాక్ బస్టర్ ఖాతాలో వేసుకున్నారు. 'ఖైదీ' టైటిల్స్ నే కాదు చిరు ఖైదీ పాత్రలు పోషించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద విజయ దుందుంబీ మోగించాయి. 'గ్యాంగ్ లీడర్'..'రౌడీ అల్లుడు' లాంటి సినిమాల్లో కాసేపు ఖైదీ పాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే. ఇక కంబ్యాక్ మూవీ 'ఖైదీ నెంబర్ 150' తో గ్రాండ్ గా రీ లీంచ్ అయ్యారు.చిరు ఇమేజ్ ఏమాత్రం చెక్కు చెదరలేదని 150 రుజువు చేసింది. అలా చిరు ఖైదీ డ్రెస్ వేసిన ప్రతీసారి బాక్సాఫీస్ మోత మోగుతూనే ఉంది. తాజాగా 'గాడ్ ఫాదర్' లోనూ చిరు ఖైదీ గెటప్ వర్కౌట్ అవుతుందనే సంకేతాలు అందుతున్నాయి. 'గాడ్ ఫాదర్' కథ జైలులో ఎక్కువగా ఉంటుందని..కథలో మలుపులు అన్ని అక్కడే ఉంటాయని వినిపిస్తుంది. మరి ఆలెక్క ఏంటి? అన్నది తేలాంటే 'గాడ్ ఫాదర్' రిలీజ్ వరకూ వెయిట్ చేయాల్సిందే. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు మోహన్ రాజా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే.



# 'మా నీళ్ల ట్యాంక్'తో లీడర్ బ్యూటీ రీ ఎంట్రీ

శేఖర్ కమ్ముల.. రానా దగ్గుబాటి కాంబినేషన్లో కొన్నాళ్ల క్రితం వచ్చి సూపర్ హిట్ ను దక్కించుకున్న లీడర్ సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయమైన బ్యూటీ ప్రియా ఆనంద్. లీడర్ సినిమాలో అందం తో పాటు అభినయంతో మంచి గుర్తింపు దక్కించుకుంది. ఆ తర్వాత తెలుగు లో పలు సినిమాల్లో నటించింది. అందులో కొన్ని నిరాశ పర్చగా కొన్ని పర్వాలేదు అనిపించాయి.కొన్ని కారణాల వల్ల తెలుగు ప్రేక్షకులకు కొన్నాళ్లుగా దూరంగా ఉంటున్న ప్రియా ఆనంద్ రీ ఎంట్రీకి సిద్దం అయ్యింది. వరుడు కావలెను సినిమా తో మంచి పేరు దక్కించుకున్న దర్శకురాలు లక్ష్మీ సౌజన్య తాజాగా 'మా నీళ్ల ట్యాంక్' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ తో ఒక వెబ్ సిరీస్ ను తెరకెక్కించింది. ఆ వెబ్ సిరీస్ లో ప్రియా ఆనంద్ నటించింది.ఒక చిన్న గ్రామంలో పనికి రాని వాటర్ ట్యాంక్ చుట్టూ నడిచే కథతో ఈ వెబ్ సిరీస్ తెరకెక్కింది. ప్రముఖ ఓటీటీ జీ5 సంస్థ నిర్మించిన ఈ వెబ్ సిరీస్ లో అక్కినేని హీరో సుశాంత్ సబ్ ఇన్ స్పెక్టర్గా కనిపించబోతున్నాడు. పల్లెటూరి అమ్మాయిగా పాత్రలో ప్రియా ఆనంద్ కనిపిస్తోంది.ఎనిమిది ఎపిసోడ్లా రూపొందిన ఈ వెబ్ సిరీస్ ని జూలై 15 నుంచి జీ 5లో స్ట్రీమింగ్ చేయబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటన వచ్చింది.ఇప్పటికే విడుదలైన టీజర్ కి మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఈ వెబ్ సిరీస్ కోసం ప్రియా సొంతంగా డబ్బింగ్ చెప్పింది. ఈ టీజర్లో ప్రియా ఆనంద్ నటన ను ప్రముఖ దర్శకుడు విక్రమ్ కె కుమార్ ప్రశంసించారు.తెలుగు ప్రేక్షకులకు చాలా కాలంగా దూరంగా ఉంటున్న ప్రియా ఆనంద్ ఈ వెబ్ సిరీస్ తో రీ ఎంట్రీ ఇచ్చి సినిమా ల్లో కూడా బిజీ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ వెబ్ సిరీస్ ద్వారా ఈ లీడర్ బ్యూటీకి సినిమా ల్లో ఆఫర్లు వస్తాయా అనేది చూడాలి.




# విజిలేస్తూ ఫస్ట్ సింగిల్ కి టైమ్ ఫిక్స్!

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ రెండేళ్లుగా ప్రాణం పెట్టి చేస్తున్న పానఖ్ ఇండియా మూవీ 'లైగర్'. వెర్సటైల్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ అత్యంత ప్రతిష్టాత్మంగా భావిస్తున్న ఈ మూవీని ధర్మా ప్రొడక్షన్స్ కరణ్ జోహార్ చార్మీ పూరి జగన్నాథ్ నిర్మిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ అనన్యా పాండే హీరోయిన్ గా నటిస్తోంది. బాక్సింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ మూవీలోని కీలక అతిథి పాత్రలో వరల్డ్ ఫేమస్ బాక్సర్ మైక్ టైసన్ నటిస్తున్నారు. దీంతో ఈ మూవీపై ఇంటర్నేషనల్ మేకర్స్ దృష్టి పడింది.ముంబై స్లబ్ ఏరియాలో వుండే ఓ ఛాయ్ బండీ వాలా ఏవిధంగా ఇంటర్నేషనల్ లెవెల్లో బాక్సింగ్ ఛాంపియన్ గా నిలిచాడనే కథ కథనాలతో ఈ మూవీని పూరి జగన్నాథ్ అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కించారు. 'ఆగ్ లగాదేంగే..' అంటూ ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్.. మైక్ టైసన్ విజువల్స్ సినిమాపై అంచనాల్ని పెంచేశారు. సిక్స్ ప్యాక్ బాడీతో కంప్లీట్ బాక్సర్ గా మారిన విజయ్ దేవరకొండ ఈ మూవీ కోసం చాలానే కష్టపడ్డాడు.ఈ మూవీతో బాలీవుడ్ బాటపడుతున్న విజయ్ తాజా గా విడుదల చేసిన న్యూడ్ పోస్టర్ సినిమాపై మరింత క్రేజ్ ని బజ్ ని క్రియేట్ చేసింది. ఆగస్టు 25న భారీ స్థాయిలో పాన్ ఇండియా వైడ్ గా తెలుగు తమిళ హిందీ కన్నడ మలయాళ భాషల్లో ఏక కాలంలో రిలీజ్ చేయబోతున్నారు. సినిమా రిలీజ్ కు సమయం దగ్గరపడుతున్నఈ నేపథ్యంలో మేకర్స్ చిత్ర ప్రచారాన్ని స్పీడప్ చేశారు. ముందుగా మ్యూజికల్ ప్రమోషన్స్ కి శ్రీకారం చుడుతున్నారు.ఈ మూవీకి మణిశర్మ నేపథ్య సంగీతం అందిస్తుండగా సాంగ్స్ కి విక్రమ్ మల్హోత్రా తనిష్క్ బగ్చి సంగీతం అందిస్తున్నారు. జూలై 8న ఫస్ట్ సింగిల్ గా 'లక్డీ పక్డీ....' రిలికల్ సాంగ్ టీజర్ వీడియోని జూలై 11న సాంగ్ ని రిలీజ్ చేయబోతున్నారు. దీనికి సంబంధించిన అనౌన్స్ మెంట్ పోస్టర్ ని బుధవారం విడుదల చేశారు.పోస్టర్ లో విజయ్ దేవరకొండ అనన్య పాండే ఫుల్ చిల్ అవుతూ కనిపించారుజ విజయ్ దేవరకొండ రెడ్ బ్లేజర్ బ్లూ జీన్స్ తో యమ జోష్ లో హీరోయిన్ తో విజిల్ వేయిస్తున్న స్టిల్ సాంగ్ మరింత జోష్ తో సాగుతుందని స్పష్టం చేస్తోంది. హీరోయిన్ అనన్య పాండే బ్లాక్ ఔట్ ఫిట్ లో గ్లామర్ ఒలకబోస్తూ కనిపిస్తోంది. ఈ పాటని పబ్ సెట్ లో షూట్ చేసినట్టుగా తెలుస్తోంది. ఈ పాటను అందించగా హుక్ లైన్ తో పాటు సునీల్ కశ్యప్ అజీజ్ దయాని సంగీత పర్యవేక్షకులుగా వ్యవహరించారు. దేవ్ నేగి పావ్ని పాండే లిజో జార్జ్ డిజె చేతాస్ హిందీ వెర్షన్ సాంగ్ ని ఆలపించగా సాహిత్యాన్ని మొహ్సిన్ షేక్ అజీమ్ దయాని అందించారు. ఇక తెలుగులో భాస్కరభట్ల సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి రమ్యా బెహెరా ఆలపించారు. తమిళ వెర్షన్ సాంగ్ ని సాగర్ అందించగా సాగర్ వైష్ణవి కొవ్వూరి ఆలపించారు. ఇక మలయాళ వెర్షన్ లో విష్ణువర్ధన్ శ్యామ ఆలపించారు. సాహిత్యాన్ని సిజ్జు తిరువూర్ అందించారు. కన్నడ వెర్షన్ లో సంతోష్ వెంకీ సంగీతా రవిచంద్రనాథ్ ఆలపించారు. వరదరాజ చిక్కబల్లాపుర సాహిత్యం అందించారు. దేశ వ్యాప్తంగా రీసెంట్ పోస్టర్ తో అటెన్షన్ ని క్రియేట్ చేసిన 'లైగర్' టీమ్ ఆగస్టులో పాన్ ఇండియా వైడ్ గా సంచలనాలకు సిద్ధమవుతోంది.



# 'టీమిండియా ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ వద్దు.. కోహ్లిని పంపండి'

సౌతాంప్టన్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టీ20లో టీమిండియా 50 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్ బౌలింగ్‌లో భారత్ దుమ్మురేపింది. అయితే తొలి టీ20లో భారత బ్యాటర్లు అంతా రాణించనప్పటికీ.. ఓపెనర్ ఇషాన్ కిషన్ మాత్రం నిరాశపరిచాడు. కేవలం 8 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్‌కు చేరాడు. ఈ క్రమంలో ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ ఆసక్తికర వాఖ్యలు చేశాడు.ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరగనున్న రెండో టీ20లో ఇషాన్ కిషన్‌కు బదులుగా కోహ్లి భారత్‌కు ఓపెనింగ్ చేయాలని స్వాన్ అభిప్రాయపడ్డాడు. కోహ్లి వంటి ఆటగాడు మూడో స్థానంలో బ్యాటింగ్‌కు రాకూడదని అతడు తెలిపాడు. ఇక తొలి టీ20కి విశ్రాంతి తీసుకున్న కోహ్లి రెండో టీ20కు సిద్ధమయ్యాడు. "విరాట్ తుది జట్టులోకి వచ్చినట్లయితే.. అతడు కిషన్ బదులుగా ఓపెనింగ్ చేయాలని భావిస్తున్నాను.కోహ్లి వంటి అద్భుతమైన ఆటగాడిని మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపకూడదు. కోహ్లి ఆస్థానంలో బ్యాటింగ్‌కు వస్తే అంత త్వరగా పరుగులు చేయలేడు. కాబట్టి కోహ్లి ఓపెనర్ గానే రావాలి. రోహిత్ అవతలి ఎండ్‌లో దూకుడుగా ఆడితే కోహ్లి కూడా అతడిని ఫాలో అవుతాడు. వీరిద్దరూ భారీ స్కోర్‌లు సాధించి భారత్‌కు అద్భుతమైన ఆరంభం ఇస్తే.. తర్వాత వచ్చే హుడా, సూర్య తమ పని తాము చేసుకు పోతారు" అని స్వాన్ పేర్కొన్నాడు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS** SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**